సంపుటి – 3 సంచికలు – 11,12
VOLUME ISSUE

ఆంధ్ర మహిళ

ఆంధ్రమహిళ

సంపుటి 3 నవంబరు 1946 సంచికలు 11, 12

రక్తపాతము ....స్వాతంత్ర్య రేఖలు

తూర్పు బెంగాల్‌లో, బీహార్‌లో, బొంబాయిలో—దేశమంతటా రక్తపాతం! స్వాతంత్ర్య సంస్థాపనకు కార్చిన వీరరక్తం కాదు; బానిస ప్రజలలో చెలరేగిన అంతర్యుద్ధ ఫలితం!

స్వరాజ్యాధికారము కేంద్ర ప్రభుత్వమునకు దఖలుపడే ఘడియలు ఆసన్నమయేటప్పటికి ముస్లిం లీగ్ నాయకుడు జిన్నాకు నిస్పృహజనించింది. దేశమంతా ఒకటే అయితే తనకు, తన అనుచరులకూ తావెక్కడ? ఐక్యజాతీయ జీవనంలో ప్రత్యేక స్వప్రయోజనానికి, మత అహంకారముపై ఆధారపడిన రాజకీయములకూ చెల్లుబడివుంటుందా? ఐక్యతను విచ్ఛిన్నం చేసి దేశాన్ని ఖండించడానికి పనకట్టిన దుష్ప్రచారము యొక్క ఫలితమే నేటి రక్తపాతము.

దేశైక్యతను భగ్నపరచదలచిన గూండా నడవడి తన ప్రయోజనమును సఫలపరచుకోలేదు. సరిగదా బలీయమగు కేంద్ర ప్రభుత్వము యొక్క ఆవశ్యకతను స్పష్టము చేసింది. దేశమంతటా వ్యాపించియున్న హిందూ మహమ్మదీయ ప్రజ మధ్య శాంతిభద్రతలను సంస్కరించుటకు అన్ని రాష్ట్రములూ కేంద్ర ప్రభుత్వము యొక్క అజమాయిషీలో వుండవలెనని నిరూపింపబడింది. ఇతర విషయములటుంచి ముఖ్యముగా అల్ప సంఖ్యాకుల ప్రయోజనము కొరకైనా దేశమంతా ఒకటిగా వుండి తీరవలెనని నిశ్చయమయింది. బలసంపన్నమైన కేంద్రప్రభుత్వం లేనిదే తూర్పు బెంగాల్‌లోని హిందువులు, యితర రాష్ట్రముల లోని మహమ్మదీయులు స్వాతంత్ర్య సర్వస్వమును కోల్పోయి, జీవితమును మట్టిపాలు చేసుకొనుట కవకాశములుండును.

పై విషయము జనాబ్ జిన్నాకు, అతని అనుచరులకూ సువిదితమే. కాననే—కేంద్ర ప్రభుత్వము ఐక్యభారత దేశమునకు చిహ్నమని తెలిసినా ఆ ప్రభుత్వములో చేరి తన అనుచరులు కాంగ్రెస్‌తో సహకారము చేయుటకు అనుమతించినాడు. అంతే కాదు. భారతదేశ ప్రజా పరిషత్తులోగూడ పాల్గొనుటకు వెనుదీయరు. చెప్పేమాటలు కాక చేష్టలను అవగాహన చేసుకోగలిగే వారికి జనాబ్ జిన్నా భయోత్పాతం కలగజేయడు. తాను కట్టిన మేడలు కూలుతున్న సమయంలో ఆ మాత్రం వాక్స్వాతంత్ర్యము యిస్తే తప్పేముంది?-అది అతనికి సంతృప్తి కలుగ జేసినప్పుడు?

సోదరుడు సోదరుని పొడిచి దేశాన్ని రక్తపాతం చేయడం దుర్భరమైన ఘటనే. ఈ పరిస్థితిని సమూలంగా తొలగించి శాంతిని సుస్థిరం చేయుటకు అహింసా ప్రవక్త గాంధీజీ తన శక్తినంతను వినియోగిస్తున్నారు. ఆయన సందేశం గూండాల హృదయ పరివర్తనకు తోడ్పడి హిందూ మహమ్మదీయ విభేదాలను తొలగించి దేశైక్యతను చేకూర్చుగాక!

బెంగాల్ కార్చిన రక్తం నేడు కాక పోయినా రేపటికి యింకి పోయి, అది కలలలో కలిసిపోతుంది. హిందువులు, మహమ్మదీయులు మానవులు కాబట్టి, వారికి మానవ హృదయం వుంది కాబట్టి నేడు సంభవించిన దుర్ఘటన ఒక సిగ్గుచేటైన కలకిందే భావించుకుంటారు. కాని యీ రక్తపాతానికి సాకుగా యేర్పడ్డ స్వాతంత్ర్య రేఖలు మటుకు నిజమై భారతదేశం ప్రపంచ సమూఖ్యలో విశిష్టమైన స్థానం సంపాదించుకుంటుంది. చైనా, అమెరికా రష్యాలచే ఆమోదింపబడ్డ కేంద్ర ప్రభుత్వం, నానారాజ్య సమితిలో దక్షిణాఫ్రికావంటి రాజ్యాన్ని ధిక్కరించి మన్ననల పొందగలిగిన కేంద్ర ప్రభుత్వం, యుగప్రవక్త గాంధీజీ ఆశీస్సులను యువరక్తం పొంగి పొరలే జవహర్ నాయకత్వమును బడయగలిగిన కేంద్ర ప్రభుత్వం భారతీయైక్యతను పెంపొందించ గలదనుట నిర్వివాదాంశము.

★

మహిళాలోక జాగృతి

అఖిల భారత మహిళా సంఘం
(మద్రాసు శాఖ)

అక్టోబరు 19వ తేదీని అఖిల భారత మహిళా సంఘం (మద్రాసు శాఖ) వార్షిక సమావేశం జరిగింది. ఆ సభకు ఆరోగ్య శాఖా మంత్రిణి శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతిగారు అధ్యక్షత వహించారు. పురస్త్రీలు చాలమంది హాజరైనారు.

శ్రీమతి సుబ్బలక్ష్మిఅమ్మాళ్, గవర్నర్ పతి లేడీ నై, శ్రీమతి రుక్మిణిలక్ష్మీపతిగార్లకు స్వాగతం చెప్పారు.

లేడీనై సభను ప్రారంభిస్తూ యీ విధంగా ఉపన్యసించారు—"నేను ఆంగ్ల స్త్రీ నవడంచేత ప్రస్తుతం హిందూదేశాన్ని కలవరపరుస్తున్న రాజకీయ విషయాలపై నా ఉద్దేశాన్ని ప్రకటించడం సమంజసంకాదు. దేశానికి స్త్రీలు ముఖ్యంగా చేయగలిగిన ఘనతర కార్యం సేవ. ప్రపంచంలోని అన్ని మతాల యొక్క ముఖ్యోద్దేశము 'మానవ సేవయే మాధవ సేవ' యన్న విషయం. ఇప్పటి రాజకీయ కార్యక్రమాల్లో ముఖ్యమైంది కూడామానవ సేవ. అయితే మన స్త్రీలు నాగరికత ప్రారంభమైనప్పటినుండీ అంటే ఆదినుండీ కూడ తోటిమానవులకు సేవచేస్తున్నారు. కాని ఇంతవరకు ఒక్క మనకుటుంబీకులను మాత్రమే యెక్కువగా సేవ చేయగలుగుతున్నాం. కాని క్రమంగా దేశకాల పరిస్థితులు మారిపోతున్నాయి. ఇక మన కుటుంబానికే గాకుండా యావదేశానికి సేవ చేయడానికి అవకాశాలు, ఏర్పడుతున్నాయి. అందుచేత స్త్రీలు దేశాభ్యుదయానికై పాటుపడాలి."

ఆ తర్వాత అధ్యక్షురాలు శ్రీమతి రుక్మిణమ్మగారు మాట్లాడుతూ ప్రజలందరూ ముఖ్యంగా గ్రామీణుల ఆరోగ్య విషయంలో చాల శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్త్రీల క్షేమానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మండలి తోడ్పాటవసరమన్నారు. మద్రాసు ప్రభుత్వం స్త్రీల కొరకై చేయబోతున్న శాసనా లెన్నో వున్నాయి. వాటన్నిటికి స్త్రీల పూర్తి సహకారం కావాలన్నారు. కలకత్తాలో నవఖాలీలో జరుగుతున్న మతవైషమ్యాలకు విచారం తెలిపేరు. నిస్సహాయులైన వితంతువులకు, అనాద స్త్రీలకు, పిల్లలకు సహాయం చేయడానికి "సోషల్ వెల్ఫేర్ శాఖ" ను ప్రభుత్వంవారు స్థాపించాలని ఒక తీర్మానం చేశారు. ఈ విధంగా స్త్రీ యోగక్షేమాల రక్షణకై మరికొన్ని తీర్మానాలు గావించారు.

లేడీస్ క్లబ్, శ్రీకాకుళం

భారతీయులకు పండుగ దిన మనదగు అక్టోబరు రెండవ తేదీన లేడీస్ క్లబ్ ఆధ్వరమున క్లబ్బు ఆవరణలో గాంధీ జయంత్యుత్సవము జరుపబడినది.

నిర్మాణ కార్యక్రమములో నూలువడకుట మహాత్మునికి ప్రియతమమైన దగుటచే, క్లబ్బు సభ్యులలో పలువురు నాటి సాయంకాలమంతయు దారము వడికిరి.

* * *

28-10-46 తేదీన శ్రీకాకుళం లేడీస్ క్లబ్ ఆధ్వరమున జరుపబడిన సభలో కొవ్వూరు వాస్తవ్యులగు శ్రీ మంగిపూడి రామలింగశాస్త్రిగారు "కర్ణాటక, ఉత్తర హిందూస్థాన సంగీతములలో భేధా భేధములు" అను విషయమై చక్కగ నుపన్యసించి పిదప సంగీత ప్రదర్శన మిచ్చి, సభ్యులలో నొకనూతన చైతన్యము కలిగించిరి.

లేడీస్ క్లబ్ తరపున కార్యదర్శి శ్రీమతి డి. సువర్ణాభాయిగారు శాస్త్రిగారికి కృతజ్ఞతాభివందనము లర్పించుచు, "ఆంధ్ర దేశమందలి గాయకులలో నెవరు రెవరు" అను పుస్తకము నచ్చువేయించుటకు తోడ్పడు నిమిత్తమై సభ్యుల నుండి వసూలైన మొత్తము నందజేసిరి.

మోర్తలో మహిళా హిందీ విద్యాలయం

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు తాలూకా మోర్త గ్రామంలో శ్రీమతి ఈడుపుగంటి రత్నమాంబగారు ప్రసిడెంటుగానున్న మహిళా కాంగ్రెసు వారి ఆధ్వరమున 5-9-46 తేదీన ఒక హిందీ విద్యాలయము స్థాపించబడెనని ఆ విద్యాలయ విద్యార్థిని ఇట్లు వ్రాయుచున్నారు.

"ప్రస్తుతము 25 మంది విద్యార్థినులు చదువుచున్నారు. చక్కగా విద్యాలయము నడుచుచున్నది.

ప్రతి శనివారము సభ జరుపుచు స్త్రీల హక్కులు, స్త్రీ విద్య, రాష్ట్ర ప్రభుత్వం మొదలైన విషయములపై మాట్లాడుచు ఉపన్యాసములు జరుగుచున్నవి."

పట్టణ మహిళాసంఘం, విజయనగరం

శ్రీమతి మా. భా. రమణమ్మగారి అధ్యక్షత. తను పట్టణ మహిళాసంఘ సభ 27 ఆదివారం జరిగింది. డాక్టరు లక్ష్మిగారు స్త్రీల ప్రస్తుత పరిస్థితిని గురించి, బి. యన్. రావుకమిటీ చట్టములోని మార్పులను గురించి, దేశముఖు, దేవదాసీ వృత్తి నిషేధ బిల్లులను గురించీ మాట్లాడిన వెనుక, ఈ క్రింది తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదింపబడినవి.

(1) హిందూ న్యాయ శాస్త్రం ఆధునిక కాల పరిస్థితుల కనుగుణ్యంగా మార్పు చెందవలెనని చేయు ప్రజాందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం బి. యన్. రావుకమిటీని నియమించింది. ఆ కమిటీ బిల్లును తయారు చేసి 1943 లోనే కేంద్ర శాసన సభ ముందుంచింది. కాని యింతవరకది చట్టముగా చేయబడలేదు. నేడు ప్రజా ప్రతినిధులు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్నందున, ఆ బిల్లును వెంటనే చట్టముగా చేయవలెనని కోరుచున్నారు.

(2) దేశముఖు చట్టముకు, దేవదాసీ వృత్తిని నిషేధించే బిల్లును, మద్రాసు శాసన సభలో ప్రవేశ పెట్టబోతున్నందుకు ప్రభుత్వమును అభినందించారు.

(3) ఈ క్రింది సంస్కరణలకు సంబంధించిన బిల్లులనుకూడ వెంటనే ప్రవేశ పెట్టవలెనని మద్రాసు ప్రభుత్వమును కోరారు.

(అ) స్త్రీలకు పిత్రార్జితపు ఆస్తిలో సహోదరులతోబాటు సమాన హక్కు కల్గించబడాలి.

(అ) బహుభార్యాత్వం నిషేధించబడాలి.

(ఇ) స్త్రీ పురుషులకు విడాకుల హక్కుండాలి.

(ఈ) వడుపు వృత్తిని నిషేధించాలి. వీరికి గౌరవ ప్రదమయిన వృత్తులు కలిగించాలి.

(ఉ) స్త్రీ పురుషులకు ప్రభుత్వోద్యోగాలు యివ్వడంలో విచక్షణ చూపకూడదు.

(ఊ) ఒకేపనిచేసే స్త్రీ పురుషులకు సమాన జీతాలివ్వాలి.

(ఋ) ఫ్యాక్టరీలలో పనిచేసే గర్భిణీ స్త్రీలకు జీతంతో సెలవు రెండు మాసములనుండి మూడు మాసములకు పెంచాలి.

(4) ప్రస్తుతం తూర్పు బెంగాలులో చెలరేగుతున్న కల్లోలములు అమానుషంగాను దారుణంగాను ఉన్నవి. హింసాత్మక చర్యలు, స్త్రీలను ఎత్తుకపోవుట, నిర్బంధముగా మతాంతరులను చేయుట, ఇండ్లు తగుల పెట్టుట, హత్యలు నిరాటంకముగా సాగుతున్నవి. ఈ నీచాతినీచమయిన కార్యములను మాన్పించుటకు ప్రజానాయకులు వెంటనే కార్యరంగమున ప్రవేశించ వలసినదని ఈ మహిళా సంఘంవారు కోరుచున్నారు.

(5) నైజాం నిరంకుశ ప్రభుత్వం ప్రజలపై అత్యాచారాలు జరుపుతున్నారు. పోలీసులు యిండ్లలో ప్రవేశించి అనేక అత్యాచారాలు జరుపుతున్నారు. స్త్రీలు పిల్లలు సహితం వారి హింసాకాండకు గురిఅవుచున్నారు. ఇట్టి ఘోర దురంతాలకు కారణమయిన నైజాం ప్రభుత్వాన్ని ఈ సంఘంవారు తీవ్రంగా ఖండించారు.

కోయపాట

శ్రీమతి
తాతాని బుల్లెమ్మగారు

టుర్ మామ కోయమామ కొండమామ
ఇప్పుడే ఒత్తుండ కొండనించొత్తుంఢ
కోరినమందులెల్ల కొల్లగతెత్తుండ
ఆకలపోతాకి అడవిమందులు లెస్తుండ
విశాఖనేనంత విడువక చూసొత్తుండ
రాయలసీమలో రగులుతుంది ఆకలిమంట
ఓ మామ తెలుగు మామ కొండదేవత సత్యం
జెపుతుండ
దురగమ్మ సత్యం చూడు మామ.

మామందు తినే అల్లూరి సీతరామరాజు గోరు
తెల్లోళ్లను నల్లులా చూస్తుండెడు మామ
గాంధి గోరుకు మామందు గుణమిచ్చిందిమామ
జవరుగారికి మామందు బద్దించిది మామ
కొత్తపెభుత్తానికి కోరిపెట్టిరి మామ.
జోషిగారికి మామందు బేధిత్తుండది మామ
జిన్నాగోరు తిట్రా జిరజిరలాడతడు మామ
కొండమందు తినకనే కయయబోయలాడు
తుండడు మామ॥

★ ఆమె అబలయేనా ★

* శ్రీ సో. రామచంద్ర అగస్త్య, ఎం. ఏ. *

ఆ రోజు వినాయక చతుర్థి—ఉండ్రాళ్లూ, తాలింపు సెనగలూ, పాయసమూ, పత్రీ వీటితోసహా బాగా మస్తుగా భోంచేయడంవల్ల కాస్త మేను వాల్చడం అత్యవసరం అని తోచడంవల్ల, హాల్లో పడక కుర్చీలో జార్లబడ్డాను. బుర్రలో ఆలోచనలు ఎడతెరిపి లేకుండా ఏరోప్లేను వేగంతో సాగిపోతున్నాయి. కొంత సేపటికి ఈ ఆలోచనలకి ఒక దానితో ఒక దానికి సంబంధం లేకపోయింది. అప్పుడు నేను నిద్రాదేవి కౌగిలిని ప్రవేశింపబోతున్నానని తెలుసుకున్నాను. ఇంతలోగా 'అయ్యగారూ' అనే పిలుపు వీధినుండి వినబడింది. తలుపు తెరిచి చూడగా ఒక స్త్రీ ముగ్గురు ఆడపిల్లలతో నిలబడి ఉంది.

"ఏమిటి సంగతి?" అని ఆమెను అడిగాను. "అయ్యా మేము మలయాదేశంలో ఉంటూ వచ్చాము. మా వారు అక్కడ యుద్ధపు కారు డ్రైవరుగా ఉండి నెలకి వంద రూపాయలు సంపాదిస్తూ ఉండేవారు. ఆయన యుద్ధ శాఖలో ఉంటూ ఉండడంవల్ల, యుద్ధ భటుల సహచర్యంవల్ల, కొన్నాళ్లకి జపానువారు మా దేశముపై బాంబు వేయనున్నారని చెబుతూ వుండేవారు. ఆయన చెప్పిన మరునాటి రోజునే జపానువారు దేశముపై దండెత్తి వచ్చారు. దేశములో ఒక భాగాన్ని పూర్తిగా బాంబులవల్ల నాశనంచేశారు. మా వారు మేము అక్కడ ఉండడం ప్రమాదకరమని చెప్పి మమ్మల్ని, నేను ఎంత వద్దంటున్నా వినకుండా, పడవ ఎక్కించి పంపించేశారు. నేను నానా అవస్థలూపడి ఈ దేశం చేరుకున్నాను బాబు. మా కష్టాలన్నీ వర్ణించి మీకు విసుగు పుట్టించదలచుకోలేదు. ఈ దేశం వచ్చి సరాసరి నెల్లాళ్లైంది. ఏదో ఉదార హృదయులైన మహానుభావుల దయవల్ల కాలం ఎలాగో ఓలాగ నెట్టగలుగుతున్నాను" అంది ఆమె దీనవదనంతో.

నాకు ఆమె వృత్తాంతము వినగానే ఎక్కడ లేని విచారమూ ముంచెత్తుకొచ్చింది. అయినా ఒకటి మాత్రం అడగలేకుండా ఉండలేక పోయాను; మీది మలయా దేశం అంటున్నావే మరి నువ్వు ఇంత చక్కగా తెలుగు ఎలాగ మాట్లాడగలుగుతున్నావు?

"అయ్యా మేము నాయుళ్లం. ఈ చెన్న పట్టణంలోనే చాలా కాలం గడిపాము. ఇదే మా పుట్టిన ఊరు. మా ఆయన అంతగా చదువుకోక పోవడంవల్ల అప్పుడు ఈ పట్టణంలో మా జీవనోపాధికి తగినంత ఉద్యోగం దొరకలేదు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోవడంవల్ల మేము ఆ దేశానికి వెళ్లి పోయాము"

"నీ భర్త విషయం ఏమైనా దరిమిలాని తెలిసిందా?"

"ఏమీ తెలీలేదు బాబుగారు. తెలుస్తే నే నిలాగెందుకు కష్టపడతాను?"

"ఏదో నా శక్తి కొలది నీకు సహాయపడతాననుకో, కాని ఇలాగ ఎంత కాలం గడపగలవు?"

"మరి గత్యంతరమేదీ లేదు బాబయ్యగారూ."

"నేను నీకో మార్గం చూపిస్తాను. దానిని నువ్వు అనుసరిస్తావా?"

"ఏమీ అడ్డులేని మార్గమైతే నేను దానిని తప్పకుండా అనుసరిస్తాను."

"నువ్వు నీ పిల్లలతో సహా మా యింట్లో వంట పనికి కుదిరిపో. నా భార్య గర్భిణిగా ఉండడంవల్ల ఇప్పుడావిడకి ఇతరుల సహాయం అత్యవసరం. నీకు ఏమీ ఆక్షేపణ లేకపోతే ఇక్కడే ఉండిపోవచ్చు."

"అయ్యా నేను ఒంటరి దానిని. నేను మీ యింటిలో ఉండడంవల్ల లోకులు పలువిధాలుగా భావిస్తారు" అంది ఆమె సంకోచిస్తూ.

"నువ్వు నా యింట్లోనే రోజ స్తమానమూ ఉండవలసిన అవసరం లేదు. పక్క వీధిలో మా యిల్లు ఉంది. అందులో

ఒక గదిలో నువ్వు ఉండేలాగ ఏర్పాటు చేసిపెడతాను. ఆ యింట్లో అద్దెకున్న ఆయన చాలా మంచి వాడు."

కొంతసేపు తటపటాయించి ఆమె ఎట్టకేలకు ఒప్పుకుంది. ఆలస్యమేమీ లేకుండానే ఆమెని పనిలో ప్రవేశ పెట్టేను. పక్కింటిలో ఆమె పెద్ద పిల్ల పైపని చేసుకునేట్లు కూడా ఏర్పాటు చేశాను. ఇలాగ సరాసరి ఒక సంవత్సరం గడిచింది. ఆమె పెద్ద పిల్ల పుష్పవతి అయ్యింది. కొన్నాళ్ళకి ఎలాగో నానా తంటాలూపడి ఆమెకు పెళ్లి చేసింది. ఆ పిల్ల కాపరానికి వెళ్లిపోయింది. ఆమె యథాప్రకారంగా కాలం గడుపుతూవచ్చింది. అంత శుభ్రంగా, అంత ఓర్పుగా అంత కులాసాగా ఉండే మనిషిని నే నెక్కడా చూడలేదు. ఆమె మా యింట్లో పనికి కుదిరిన కొన్నాళ్ళకే Protector of Emigrants ని చూచి ఆమె విషయం అతనికి తెలియ జెప్పి, ఆమె తరఫున ఒక అర్జీరాసి యిచ్చాను. అతడు ఆమె కష్టాల్ని గ్రహించి, ఆమె భర్త మలయాలో యుద్ధానికి ముందు మిలిటరీలో ఉంటూ ఉండడంవల్ల, ఇప్పుడు అతడు ఎక్కడ ఉన్నాడో తెలియక పోవడంవల్ల అతని భార్యాబిడ్డలు చాలా కష్టపడుతూ ఉండడంవల్ల, నెలకు ఎనిమిది రూపాయలు ఎలవెన్సు ఇప్పించగలందుకు ఒప్పుకున్నాడు. ఏదో ఆ డబ్బుతోటీ, నేను ఇచ్చే జీతంలో అద్దెకు పోగా మిగిలిన డబ్బుతోటీ, ఆమె సాఫీగా జీవితాన్ని సాగిస్తూ వచ్చింది.

ఆమె మా యింటికి పనికి వచ్చి రమారమి మూడు ఏళ్లు గడిచాయి. ఒక రోజు ఆమె మా యింట్లో వంట చేస్తూ చేస్తూ బొటబొటమని కన్నీరు కార్చడం నేను చూశాను. నేను తనవైపు చూడడం గమనించి త్వరత్వరగా కళ్లు తుడిచేసుకుని యథాప్రకారంగా ఏమీ జరగనట్లు, ఉండడానికి ప్రయత్నించింది. ఏ విషయాన్నైనా సరే తెలుసుకోడానికి నానా అవస్థలూ పడడం నాకు అలవాటు కాబట్టి ఆమెను ఆవిడ విచారానికి కారణ మేమిటి అని అడిగాను.

"అబ్బే ఏమీ లేదండీ" అంది ఆమె హీనస్వరంతో.

"ఏమీ లేదంటే నేను ఒప్పుకోను. ఇన్నాళ్లబట్టీ మాతో ఉంటున్నావు. మాతో అసలు విషయం ఏమిటో చెప్పడానికి శంకిస్తావెందుకు?" అన్నాను.

"అయ్యా మీరు నాకు చేసిన ఉపకారము ఇంతా అంతా అని చెప్పడానికి వీలులేదు. మీ ఋణాన్ని నేను ఈ జన్మలో తీర్చుకోలేను. మీతో నే నాసంగతి చెప్పక పోవడానికి కారణం మీ మనస్సుని నొప్పించకుండా ఉండేందుకే. ఇంత వరకూ నా కోసమై ఎంతో కష్టపడ్డారు. అటువంటి మీతో నా కష్టాల్ని ఇంకా ఏకరువు పెట్టి మీ మనస్సుకి శాంతి లేకుండా చేయడం నాకు సుతలాం ఇష్టం లేదు."

"అనాథవైన నీకు తగు సహాయం చేసి రక్షించడం నా విధిగా తలచేను కాని నేను నీకు ఉపకారం చేసినట్లుగా తలచలేదు. అదీ గాక నిన్ను నా స్వార్థానికే ఉపయోగించుకున్నాను. అందుచేత నేనేదైనా ఉపకారం చేసినంటే దానికి తగిన ప్రత్యుపకారము నువ్వప్పుడే చేసేశావు. అందుచేత శంకవిడిచి నాతో యదార్థాన్ని తెలియ జేయి" అన్నాను.

"మొన్న మొన్నే మా ఆయన పినతల్లి గారు, కాకినాడ కాపురస్థులు, ఇక్కడికి రావడం తటస్థించింది. ఆవిడ మీ యింట్లో అద్దెకున్నాయనకి దగ్గర బంధువట. ఆమె వస్తూండగానే నన్ను గుర్తుపట్టింది. అయినా పలకరిస్తే నే నెక్కడ వెంటబడతానో అనే భయంవల్ల ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది. నేనే ఉండబట్టలేక ఆమెని పలకరించాను. పోయిన వారమే ఆయన ఆమెకో ఉత్తరం రాసేరట. ఆ ఉత్తరాన్ని ఆమె చదివికూడా నాకు వినిపించింది." అని మాట్లాడకుండా ఊరుకుంది.

"అందులోని సంగతు లేమిటి?"

"ఆయన రెండో పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలతో సుఖంగా ఉన్నారట"

"రెండో పెళ్లా? అదేమిటీ?" అన్నాను నేను విస్తుపోయి.

"ఏమిటి బాబూ వారు మగ రాజులు. వారేమి చేసినా చెల్లుతుంది. ఆడది అటువంటి పని చేస్తే లోకం ఈపాటికి దానిని చీల్చి చెండాడేది."

"పోనీ నీ విషయం ఏమన్నా ఆ ఉత్తరంలో రాశాడా?"

"ఏమీ లేదండి. ఆయన తన జీవితంలో నన్నెక్కడా కలుసుకొన్నట్లుగానే లేదు. ఆ ఉత్తరపు ధోరణిని బట్టిచూస్తే ఇంతకీ కష్టపడేది ఆయన కాదుగదా. పిల్లల్ని నా నెత్తికి అంటగట్టేసి, ఆయన స్వేచ్ఛగా కాలం గడిపి ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుని కాలం గడుపుతున్నారు. పోనీ ఆయన సుఖంగా ఉండనియ్యండి. అదే పదివేలు" అంది ఆమె రుద్ధ కంఠంతో.

ఆమె చాలా ఆవేదనపడుతున్నట్లు నాకు తెలిసింది. కానీ నే నేమి చేయగలను? ఆవిడ తన భర్తవైపు చూపిన ఔదార్యాన్ని బట్టి ఆమె అక్కడికి గాని వెళ్లి అతని దగ్గిరే ఉండడానికి ఇష్టపడుతుందేమో అనుకుని "పోనీ నువ్వు అక్కడికి వెళ్తావా" అని అడిగాను.

"నేను అక్కడికి వెళ్లవలసిన అవసరం ఏమీ లేదు. ఎప్పుడైతే ఆయన మా కోసం ఎత్తలేదో ఇక ఆయన దగ్గిరకి వెళ్లి ప్రయోజనం? ఇంతకీ రెండో పెళ్లి కూడాను. ఏదో అమ్మగారికి సేవ చేస్తూ నేను నా శేష జీవితాన్ని గడిపేస్తా" నన్నది. ఆమె ఆ మాటల్ని నిశ్చలంగా, నిర్విచారంగా అన్నది. ఆమె స్థైర్యానికీ, త్యాగానికీ నేను చాలా మెచ్చుకున్నాను. స్త్రీ లందరూ, పురుషులందరూ, అను కునేలాగ 'అబల' కాదని ఆమె ప్రత్యక్షంగా నిరూపించింది. ఇటువంటి స్థైర్యవతులు ఇంకా చాలామంది దేశంలో ఉంటే దేశం ఎంత బాగుపడేనో అనుకున్నాను నేను. ఇటువంటి స్త్రీలు ఇంకా చాలామంది దేశంలో ఉంటే వారికందరికీ నా జోహారులు.

★

ప్రేమాంజలి

శ్రీమతి
స్థానాపతి రుక్మిణమ్మగారు

గీ॥ చక్కదనమునె ప్రేమింప చాలుదేని
వలదు ప్రేమింప - దశదిశల్ వెలుగచేసి
ఆదిమధ్యాంతములు లేని అధికదీప్తి
చక్కనౌ కాంతి ప్రేమింప చనును నీకు.

గీ॥ తరుణి నంచును ప్రేమింప తలతువేని
మాను ప్రేమింప - నేటేట మలయునపుడు
నవనవోన్మేషరీతుల నాట్యమాడు
మాధవుని నీవు ప్రేమింప మంచిదగును.

గీ॥ ధనముకోసమె ప్రేమింప తలచితేని
వలదు ప్రేమింప - నుడువగా నలవికాని
రత్నరాసుల వెలుగొందు రహిదనర్చు
నుదధి నెప్పుడు ప్రేమింప నొప్పునీకు.

గీ॥ ప్రేమకై నన్ను ప్రేమింప బేర్మితలతె
ప్రేమమున్ గొల్వరావోయి ప్రియవయస్య!
ఇనుడు, మాధవు, డుదధి ఇన్నింటికంటె
నమ్మకమ్మగునాడు మనమ్మునిడుదు.

★



గాంధీజీ ఏమంటారు?

బెంగాల్‌లో అనేకమంది హిందూ స్త్రీలు నానా హింసలకు లోనవుతున్నారు. వారి శీలం ధ్వంసం చేయబడుతోంది; బలవంతంగా వారి మతం మార్చబడుతోంది. గాంధీజీ, దీనికి మీరేమంటారు?

“హిందూ స్త్రీలు అంత నిస్సహాయులా? పౌరుషం, సాహసం స్త్రీలలో నశించిందా? ఝాన్సీరాణి ఖడ్గాన్ని చేబూని ఆమె ప్రతిభను లోకానికి చాటింది. నిజమే. కాని నేడు స్త్రీల చేతులలో ఆయుధాలు లేవు; ఝాన్సీరాణిని అనుసరించగలిగే శక్తి స్త్రీలందరకూ వుండడం దుర్లభం. అయితే సీతాదేవి మాటో? ఆ మహాతల్లి నిరాయుధురాలైనప్పటికీ లంకాధీశ్వరుడు రావణుని ధిక్కరించింది; ఆ రాక్షసుడు ఆమెను ముట్టుకోడానికి గూడా జంకాడు; ఆమె దరిజేరడానికి గజగజలాడాడు. సీతమ్మతల్లి తేజస్సు ముందర ఝాన్సీరాణి కత్తిబలం ఒక లెఖ్ఖా! నిరాయుధులైన స్త్రీలు ఆ మహాతల్లిని అనుసరించి వారి పాతివ్రత్యం కాపాడుకోవచ్చునే!”

* * * *

బాపూ, పౌరాణిక విషయం వుదాహరణగా చూపి ప్రస్తుత పరిస్థితుల నెదుర్కొమనడం న్యాయమా?

“పౌరాణిక యుగమును తేజోవంతము చేసిన సీతాదేవిని నేడు అనుసరించడం దుర్లభమని ఎవరూ అనుకోకూడదు. ఆలివ్ డోక్ గారిని గురించి వినలేదూ? ఆయన యేం చేసాడూ? ఆనాడు నీగ్రోలు అనాగరికులు, బట్టలు కట్టుకొని మానం మరుగుపరుచుకోడమేనా తెలియదు వారికి. క్రూరులుగా, పశువులుగా పరిగణించ బడేవారు; కారరణ్యాలలో తిరిగేవారు. ఆలివ్ డోక్ వారి వద్దకుపోయి, ఆ నీగ్రో దండుల మధ్య నిర్భయంగా నివసించాడు, ఏ మాత్రం అపాయమూ లేకుండా. ధైర్యం అంటే అది! సాహసం అంటే అది! అట్టి ధైర్య సాహసాలనే హిందూ స్త్రీలు అవలంబించాలని కోరుతున్నాను. పోలీసువాళ్లు, మిలిటరీవాళ్లు యిచ్చే సహాయం యేపాటిది? బలవంతంగా లాక్కుపోబడకుండా కాపాడగలుగుతే కాపాడగలరు వారు. ఆ మాత్రమైన సహాయమూ లభించని వారి మాటేమిటి? పాతివ్రత్యాన్ని రక్షించుకునేందుకు ఆహుతి అయిపోవడం నేర్చుకోవాలి. వారి తలమీద ఒక వెంట్రుకకైనా హీనత కలిగేముందర, అపాయం సంభవించే ముందర ప్రాణాలను త్యజించగలిగే మనోబలమును అలవరుచుకోవాలి! ప్రాయోపవేశం చేయడం అంత కష్టమైన పనిగాదు.”

గాంధీజీ ఏమంటారు?

"దసరా రోజుల్లో ఉత్సవాలు ఎలాగ జరిపించం?" అన్న ధర్మ సందేహంవచ్చి ఎవరో జాబు వ్రాసేరు! ఊరేగింపులు లేవదీసి ఊరేగమా? దిట్టంగా పొట్టలు నింపి, పానీయాలు సేవించి, 'గాలా' దివాలుగా గడపమా? అని అడిగారు! గాంధీగార్ని.

"నిన్ననే నేను ఘోషించేను—జీవితోత్సాహం జీర్ణించి పోయిందని. దేశంలో సోదరుడు సోదరుణ్ణి ద్వేషించుకుంటూ, నిత్యమూ కత్తిపోట్లతో కసితీర్చుకుంటుంటే— మనకు ఉత్సవాలెలాగవు తాయి? శ్రీరాముడు రావణుణ్ణి హతమొనర్చి దిగ్విజయం పొందినందుకు వేడుక కార్యక్రమం సాగించే రోజులు దశరాలంటేను. కాని ఆ విజయం హింసాత్మకమైందిగాదు. విభీషణుడు శ్రీరాముణ్ణి అడిగేడు—"కవచధారియైన, బ్రహ్మాండ బలోపేతుడైన, రథారూఢుడైన రావణుణ్ణి ఎలా జయించ బోతార"ని. శ్రీరాముడు చెప్పాడు—ఆత్మ విశ్వాసం, సంకల్ప శుద్ధి యివే యుద్ధంలో జయం పొందేవని. ఆత్మ సంయమమే అతడికి ధనస్సు. అధర్మంపై ధర్మం పొందే విజయమే అతడి విజయం. ఆఖరుకు గాంధిజీ యిలా సలహా యిచ్చేరు. మతం యొక్క యదార్థం, దసరాయొక్క అంతరార్థం మీరు అవగాహన చేసుకున్నట్లైతే దసరా దినాలు యింట్లోనే ప్రశాంతగా ప్రార్థనలతో గడపండి అని. కావలసిన దానికంటె హెచ్చుగా యెన్నడూ తినకండి. హింసాత్మక కార్యాలు స్వరాజ్య సిద్ధికి అడ్డు తగులుతాయని గుర్తించండి.

★

మదరాసు మంత్రి కె. భాష్యంగారు క్వీన్ మేరీస్ కాలేజీలో యిలా వుపన్యసించారు:

మనుధర్మ సూత్రాలకు కొంతమంది భాష్యకారులు అపార్థం కల్పించారు. అందుచేతనే స్త్రీలకు సంఘంలో సముచితస్థానం లేకపోయింది. ఈ లోటును తీర్చ డానికే కేంద్ర శాసనసభ "హిందూ స్త్రీల ఆస్తి హక్కు చట్టం" చేసింది. అయితేనేం? న్యాయశాస్త్రులకు వ్యాఖ్యానాలు చెప్పేవారు బయలుదేరి ఆ చట్టం భూస్థితికి చెందదు; రొక్కం, యితర ఆస్తి యేమైనా వుంటేగింటే స్త్రీ వారసులకు అవిమాత్రం దక్కుతాయి అన్నారు. ఈ విధంగా ఆస్తి హక్కుచట్టం అడవిలో వెన్నెల అయిపోయింది. స్త్రీలకు కలిగిన యీ అన్యాయాన్ని తొలగించడానికే మద్రాసు ప్రభుత్వం త్వరలో ఆస్తి హక్కుచట్టాన్ని సవరిస్తోంది. దీనివల్ల స్త్రీలకు భూవసతిపైగూడా హక్కు యేర్పడుతుంది."

★

సంతానం బాగుపడాలంటే....

* శ్రీమతి కె. సుగుణమణిగారు *

సత్సంతానం కలగాలంటే అనేకమంది అనేక విధాలుగా చెపుతారు. జన్మతః ఉండాలని కొందరూ, మంచి శిక్షణ ఉండాలని కొందరూ అంటారు. అసలు ఏది ఎంతవరకు యదార్థమో నన్నది పెద్దలు చెప్పిన విషయాల్ని బట్టీ, శాస్త్రరీత్యానూకూడా చూద్దాం.

1. వంశం:—వంశంయొక్క లక్షణాలు, వంశపారంపర్యా సంక్రమిస్తుంటాయి (Heredity). తల్లిదండ్రుల సుగుణ-అవగుణాలు, శక్తి-సామర్థ్యాలు, శరీర-మానసిక తత్వాలు పిల్లల్లో ప్రతిఫలించడం నిర్వివాదాంశం. ఒక్కొక్క కుటుంబంలో 'పండిత పుత్రులు' పుడుతుంటారు! ఇందుకు కారణం తర్వాత చూద్దాం.

పిల్లలు పుట్టడంలో తల్లిదండ్రుల శుక్ల-శోణితాలు (పురుష బీజం-స్త్రీ అండం రూపాలుగా) కలుస్తాయని, అప్పుడా అండం ఒకటి-రెండు, రెండు-నాలుగు, నాలుగు-ఎనిమిది ఇలా విభాగించుకుంటూ అంగాంగ విభాగాలతో పిండంగాను, పిండం బిడ్డగాను తల్లి గర్భకోశంలో ఎదిగి ప్రపంచంలోకి వస్తారని ఎరుగుదుం. ఇలా స్త్రీ పురుష బీజాలు కలియడంలో తండ్రి గుణాలు, తల్లి గుణాలు వీటిల్లో 'క్రోమోజోమ్సు' (chromosomes) అనే సూక్ష్మ తంతువుల్లో సూక్ష్మాతిసూక్ష్మమైన 'జీన్సు' (genes) రూపంగా యుండి, సంయుక్తం చెంది, అవి విభాగించుకుంటూ, బిడ్డ శరీరంలో ప్రతీకణంలోను అణగివుంటాయని, శాస్త్రం తేల్చింది. ఇవి బిడ్డయొక్క శరీరక లక్షణాలు (రంగు, పొడుగు వగైరాలు), మానసిక లక్షణాలు (శీలం, తెలివి, ప్రవృత్తి, వగైరాలు) నిర్ణయిస్తాయని పాశ్చాత్తులశాస్త్రం అంతవరకే, కనుక్కోగలిగింది. మనవారుకూడా ఇంతవరకూ ఒప్పుకుంటారు. ఇంకా శాస్త్రానికందరాని ఆధ్యాత్మిక విషయాలు కొన్ని ఉన్నాయని చెప్పగలరు.

ఈ బీజ సంయోగ కాలంలోను, గర్భిణీగానున్న కాలంలోను తల్లియొక్క ఆరోగ్యం, మానసిక ప్రవృత్తికీగూడా చాల ప్రాముఖ్యస్థానం ఉంది. ఈ కాలంలో తల్లియొక్క శరీరారోగ్యం, మనః ప్రవృత్తి పుట్టబోయే శిశువుయొక్క లక్షణాలు అద్భుతంగా నిర్ణయిస్తాయి. ఇందుకు మన పురాణాల్లో ఋజువులున్నాయి, ప్రత్యక్షంగాకూడా కొంతవరకు ఋజువు చూపించవచ్చు. చూడండి, ప్రహ్లాదుడు కడుపులో నుండగా నారదుడు లీలావతికి నూరిపోసిన ఆధ్యాత్మిక విషయాలెంత ఆశ్చర్యంగా పనిచేసేయోను. రాక్షసి తండ్రికి, దేవతలకు సైతము దుర్లభమైన-మహిమోపేతుడు పుట్టేడు. అంబిక, వ్యాసునిగడ్డం మీసాలరూపానికి భీతిల్లి, కండ్లు మూసుకుని కలియడంచేత, జ్యాత్యంధుడైన దృతరాష్ట్రుడు జన్మించేడని, అంబాలిక, వెలవెలబోయి యుండడం కారణంగా పాండు శరీరి పుట్టేడని ఋజువులున్నాయి. శ్రీరామ కృష్ణ, వివేకానందవంటి మహా ప్రవక్తలు, శివాజీ, గాంధీలాంటి దేశభక్తులు కడుపున పడ్డప్పుడూ, వార్ని గర్భంలో ధరించియున్నప్పుడూ వారి తల్లుల మనః ప్రవృత్తులెలాగున్నారో మనకిప్పుడు ఎలా తెలుస్తుంది? మనకు తెలిసినంతవరకు మహాపురుషుల రాకకు మాతృదేవతల అప్పటి మనః ప్రవృత్తులే విస్తారంగా హేతుభూతాలని స్పష్టమౌతుంది. గొప్పగొప్ప భావాలు మనః ఫలకంలో ప్రవహిస్తున్నప్పుడు వానివల్ల రక్తంలో మార్పులేర్పడతాయని శాస్త్రం కనుక్కోగలిగింది గాని, మన శరీరంలో పనిచేసే అనేక 'నిర్నాళిక గ్రంధుల ద్రవాలు', పైనచెప్పిన 'క్రోమొజోమ్సు', 'జీన్సు'ల వరకు జరిగే మార్పుల ఆరాతీయ లేకపోయింది. కోపంగా నున్నప్పుడు బిడ్డలకు పాలివ్వరాదని శాస్త్రం చెప్పడం యెందుకంటే, కోపంవల్ల రక్తంలో కొంత విషపదార్థం తయారౌతుందన్నదే కారణం. శాస్త్రం ఇప్పుడు కనుక్కున్నా కనుక్కోపోయినా మన పెద్దలు

తల్లులు గమనించవలసిన విషయాలు

విధించినవిధాలు—తల్లి గర్భధారణ సమయములోను, గర్భవతిగానున్న కాలంలోను సంపూర్ణారోగ్యంగా వుండాలనడం, సద్గ్రంథపఠన, సత్సాంగత్యం, సత్ చింతన, మహాపురుషులు-పతివ్రతామతల్లుల చరిత్రలు వినడం, ఉత్కృష్టభావాలు కలిగించుకోవడం, మహత్తర ఆశయాలు పెట్టుకోవడం ఇలాంటివన్నీ గొప్ప దూరదృష్టితోను, అనుభవంతోను పెట్టిన పద్ధతులు. తమ బిడ్డలు కుటుంబోద్ధారకులు, కులోద్ధారకులు, దేశోద్ధారకులు కావాలంటే తల్లులు కాబోయే మన స్త్రీ జనులంతా యీ విషయాలు జ్ఞప్తిలోనుంచుకుని ఆచరిస్తే ఫలితాలు అమోఘంగా ఉంటాయనడానికి ఎంత మాత్రం సందేహం లేదు, ఇందుకే స్త్రీలనుగురించి పెద్దలంత శ్రద్ధతీసుకొన్నది. నారీమణుల సత్సంకల్పాలు, పటుతర ఆశయాలే భావి భారతంయొక్క భాగోగులు నిర్ణయిస్తాయని గ్రహించి, చరించవలసిన బాధ్యత తల్లులదైయుంది.

2. ఇక తర్ఫీదు, శిక్షణ అన్నవి సహజ వజ్రానికి మెరుగు పెట్టడం వంటివి. మాతృశిక్షణలోకూడ మహత్తర సామర్థ్యాలున్నాయన్న విషయంకూడా నిర్వివాదాంశమే. ఐతే వజ్రమంటూ ఉన్నప్పుడుగదా దానికి మెరుగుబెట్టేది! మసి బొగ్గును తెచ్చి మెరుగు పెడదామంటే-తెనాలి రామలింగడు నల్లకుక్కను తెల్లకుక్కగా జేయడానికి తాపత్రయ పడ్డట్టుంటుంది! గాని బొగ్గు వజ్రమెట్లాగవుతుంది! గనుక ముందుగా మసిబొగ్గుల్నిగాక, మంచి వజ్రాల్ని కనవలసిన గొప్ప బాధ్యత తల్లిపైనుంది. ఇందుకు తల్లులు మంచి ఆరోగ్యవంతులు, విజ్ఞానవంతులు కావాలి.

వంశ సాంప్రదాయాలు వంశ పారంపర్యా సంక్రమిస్తాయన్నది తేలింది. ఇక పుట్టినబిడ్డ, పెరిగేటటువంటి వాతావరణం (Environment) ప్రాధాన్యతకూడ తెలుసుకోవలసియుంది. గొప్పవారంతా చాలవరకు పుట్టుకతోటే తయారైరావాలి. పెరిగే వాతావరణం వజ్రానికి మెరుగుపెట్టడం వంటిదంటారు. ప్రహ్లాదుడులాంటివాణ్ణి పరిసరాలు ఏమీ చేయలేకపోయేయిగాని, మన సామాన్యజనుల బిడ్డల విషయంలో కొంత శ్రద్ధ అవసరం. గాంధీలాంటివారినే, చుట్టత్రాగుడూ, మాంసభక్షణవరకు దుర్జన సాంగత్యం లాక్కెళ్లిందంటే, మనకు దానిమహిమ కొంత తెలిసి ఉండాలి. చిలకపిల్లలు రెండూ ఒక తల్లికేబుట్టినా, కసాయివాళ్లలో పెరిగింది మాంస భక్షకుల్నిగురించి మాట్లాడిందనీ, సజ్జనుల యింట పెరిగింది మర్యాదపలుకులతో ఆహ్వానించిందనీ కథ అంతా వినేయుంటారు. ఇది కేవలం కథ అనుకొందుకు వీల్లేదు. పాశ్చాత్య శాస్త్రజ్ఞులు చింపాంజీపిల్లలలోను, మనిషి-ఇతరజంతువులతోను ప్రయోగాలుచేసి, దీని సత్యాన్ని ఋజువుచేసేరు. (Heredity, Environment) రెండూ కూడా ప్రతివ్యక్తిని తయారు చేస్తుంటాయని పెద్దలూ, శాస్త్రజ్ఞులూకూడా తేల్చారు, దీన్నే మనవారు "ఎక్కడ పుట్టేవు", "ఎక్కడ పెరిగేవు?" అంటూంటారు. అంటే (Heredity and Environment) రెండూ విచారిస్తారు.

సద్గుణాలకంటె దుర్గుణాలు చప్పున పట్టుపడతాయేమని గాంధీగార్ని ఒకప్పుడెవరో అడిగితే "మెట్లుదిగడం, ఎక్కడం ఎలాంటివో ఈ రెండూ అలాంటివే"నని చక్కగా జవాబిచ్చేరు. ముఖ్యంగా చిన్నప్పుడు బిడ్డలు తల్లిదండ్రుల్ని అనుకరించడం, కన్నవార్ని విన్నవార్ని గురించి ఆలోచిస్తూ అలా తయారవడం కొంత యుంటుంది. అందుచేత పిల్లలు విద్యాబుద్ధులు గరుస్తూ, పెరిగి పెద్దవారయ్యే పరిసరాలు, వాతావరణం విషయమైకూడా తల్లిదండ్రులు శ్రద్ధవహించాలి. 'హిట్లరు' యొక్క తల్లిదండ్రులు భక్తి-శ్రద్ధలు, శాంతి-సమరసభావాలున్నవారే ఐతే మరి అతడు అలా తయారవడానికి కారణం చాలవరకు పెరిగిన వాతావరణం, అబ్బిన స్నేహాలనన్నారు.

ఒక్కొక్కప్పుడు 'పండిత పుత్రులు' పుట్టడం, 'కొరగాని కొడుకులు' పుట్టడం, కొందరు 'వంశంలో తప్పబుట్టడం' జరుగుతుంటుంది! దీనికి కారణాలు పైనచెప్పిన కాలాల్లో తల్లి ఆరోగ్యం, మానసిక ప్రవృత్తులు, బిడ్డగానున్న కాలంలో తర్ఫీదు, శిక్షణ, వీటి ప్రమేయమేగాక, ఏ కారణాలవల్లనో (వంశ లక్షణాల కాకరాలయ్యే) 'క్రోమొజోమ్సు', 'జీన్సు'ల్లో మార్పులు రావడమని శాస్త్రం కొంత సమజాయిషీ యిస్తుంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలు చూపించడమేగాక, శాస్త్రజ్ఞులు 'యక్సురే' ప్రసారం, 'కాల్చిసిన్' లాంటి రసాయని కాలప్రయోగం వ

రాలవల్ల క్రోమొజోమ్సులో మార్పులు తెచ్చి అదివరకు లేని క్రొత్త క్రొత్త వృక్ష, జంతు సంతానాల్ని కలిగించ కలిగేరు.

అవకాశాలు తమకు తాము స్వయంగా కృషివల్ల కల్పించుకుని, అవకాశాలు వెదుక్కుని పైకి వచ్చేవారు కొందరుంటారు. అవకాశాలిస్తే పైకి వచ్చేవారు మరికొందరుంటారు, అవకాశాలిచ్చినా సద్వినియోగపర్చుకో లేనివారు కొందరుంటారంటే దీనికి కారణం పుట్టుకతోనే వారి సామర్థ్యాలు అంతవరకే నిర్ణయమై వున్నాయనుకోవాలి. ఇదిగాక మన 'కర్మ సిద్ధాంతం' ఒకటియుంది. ఐనా హిందూ మత సాంప్రదాయం ప్రకారం నైతేనేమి, పాశ్చాత్త శాస్త్రజ్ఞులు తేల్చినదైతేనేమి—మనలో ప్రతివ్యక్తిలోను మహత్తర శక్తులిమిడియున్నాయని వాటి పూర్తి వికాసానికి, విజృంభణకు తర్ఫీదూ, విద్య, అవకాశాలూ యివ్వాలన్న విషయంకూడా గమనించాలి. పుట్టిన ప్రతివ్యక్తికి గాలి పీల్చడం, నీరు త్రాగడం, తిండి తినడం, బట్ట కట్టుకోవడం, విద్య నభ్యసించడం, తగినంత పని—విశ్రాంతులుండడం, తన సామర్థ్యాల్ని విద్య-విజ్ఞానాలవల్ల అభివృద్ధి పరచుకుని తనకు, దేశానికి ఉపకరించేటట్లు చరించడం, వగైరాలెన్నో జన్మ హక్కులైనా, ప్రస్తుత నాగరికత ప్రకారం యిలాంటి జన్మహక్కులకే నోచుకోకుండా శుష్కించి పోయే జీవితాలెన్నో ఉన్నాయి.

స్త్రీలు తలుచుకుంటే ఈలాంటి సంఘ వ్యవస్థను, జీవిత వ్యవస్థలను మార్చగలరు. స్త్రీ శక్తి స్వరూపిణే గాక సంకల్పసిద్ధురాలనికూడా గమనించాలి.

★



— తల్లి చేసుకున్న పుణ్యం —

విజయలక్ష్మీ పండిట్, క్రిష్ణా హఠీసింగ్

— చిన్నప్పుడు —

స్త్రీల క్షేమం

రేడియో చర్చలో పాల్గొన్నవారు

శ్రీమతి మోన హెన్సుమెన్, శ్రీమతి మేరీ క్లబ్‌వాలా, శ్రీమతి పారిజాతం నాయుడు

(రి జెనర్ నుండి)

మో. హె.: స్త్రీల క్షేమం అన్నప్పుడు ఈ సమస్య సర్వతోముఖంగా చర్చించాలంటే-మానసిక, నైతిక, ఆధ్యాత్మిక క్షేమాలన్నీ గమనించాలి. ఎందువల్లనంటే స్త్రీలే జాత్యౌన్నత్యానికి సంరక్షకులు, వారు సంరక్షకులై నిలుచున్న చోటనే జాతి నిలబడియుంటుంది. ("ఏ రాజ్యంబున దరుణులు—దారుకళా కుశల సుస్వతంత్రలు గలరో, ఆ రాజ్యంబున బురుషులు ధీరులు, నధికారు లమలధీ సువిచారుల్"). అఖిలభారత స్త్రీ సంఘాలు, సంస్థలకు మేము కృతజ్ఞులం; వీటికి ఋణపడియున్నాం ఎందుకంటే-రాజకీయ లాభాలు ఇతర అవకాశాల విషయాల్లో — యివే మమ్మల్ని దూరసీమల నారీమణులతో సమాన స్థాయికి తెచ్చేయి. విద్యా వ్యాప్తికై గావించే కృషి స్త్రీలలో నిరక్షరాస్యతను నిర్మూలించి, సమానత్వం నెలకొల్పడానికి తోడ్పడి, శిథిలమైపోయిన పాతకాలపు ఆచారాలు అలవాట్లువల్ల యేర్పడ్డ అడ్డంకుల్ని తొలగిస్తుంది. వీటన్నిటిని సాధించడం చాలవరకు న్యాయశాస్త్ర సమ్మతంగానే జరిగింది.

మే. క్ల.: న్యాయశాస్త్రం, శాస్త్రంగా ఉండిపోతే యేమిటి లాభం? సంస్కరణకై గావించిన అనేక ప్రతిపాదనలు, అలాగే ప్రతిపాదనలు (Resolutions) రూపంగా కాగితాలమీద ఉండిపోయేయని మీకు తెలుసా? అవి ఎవరికేమి లాభం చేసేయి? ప్రజల హృదయాల ద్వారా న్యాయశాస్త్రం పని చేయాలి; అందుచేత మీరు తెల్పిన అడ్డంకులు తొలగించడానికి, ప్రజా హృదయంలో మార్పులు రావడం చాల ప్రధానమైన విషయం. ఈ విషయమై స్త్రీల సంఘాలు ఏమైన ఉపయోగ కరమైన కృషి చేసేయని మీరు తలుస్తున్నారా?

పా. నా.: ఈ ప్రశ్నే నాకు నేను, అనేక మార్లు వేసుకున్నాను — "ఈ స్త్రీల సంఘాలు ఏమైనా లాభకరమైన పని చేసేయా?" అని. మనకు విద్యావిషయాల్లో యెక్కువ స్వేచ్ఛ, రాజకీయల్లో హక్కులు నిస్సందేహంగా ఉన్నాయి; కాని యీ అవకాశాలవల్ల నిజంగా లాభంపొందిన స్త్రీలు చాల తక్కువ. వీరంతా శ్రీమంతుల కుటుంబాల్లోని వారు—ఒక ప్రత్యేక శాఖగా యేర్పడే వారు అని మీకు తెలిసేయుంటుంది. అంచేత, ఏలాగైనా, మధ్యమ తరగతి—బీదసాదల కుటుంబాల్లోని వారి సమస్యలు అలాగే ఉన్నాయి. యదార్థం చెప్పాలంటే వీరు

పూర్వంలాగే ఉండిపోయేరు—("ఎక్కడున్నావే గొంగళీ?" అంటే—"వేసిన చోటే ఉన్నాను!" అన్నట్టు) ఇంత వరకు సాధించిన ఎంతటి విద్య—రాజకీయ—సంస్కరణలైనా అందరికీ లాభించేయనడానికి వీల్లేదు. ఎందుకంటే, ఇవి, అధిక సంఖ్యాకులై తద్వారా దేశానికి వెన్నెముకయైనటువంటి పైన చెప్పిన తరగతుల వార్ని తాకనే లేదు. నా అభిప్రాయంలో, ఈ తరగతుల స్త్రీల విషయం మెత్తుకుంటే తప్ప, "స్త్రీల క్షేమా"న్ని గురించి మీరు చర్చించనే లేరు; "స్త్రీల క్షేమం" అన్నప్పుడు ఆశయం యేమిటైయుండాలంటే స్త్రీలు సౌభాగ్య జీవితాలు గడపడానికి కావలసిన సావకాశాలన్నీ సమకూరాలి; వీరిప్పుడు ఏ యే లోపాల వల్ల యిబ్బందులు పడుతున్నారో వాటిని తొలగించడమై యుండాలి. అంటే—వీరి జీవిత అర్థిక పరిస్థితులూ,ఆలోచనా సామర్థ్యాలూ రెండూ అభివృద్ధి పరచవలసి యుంటుంది. అప్పుడే స్త్రీలు ఇంట్లోను సంఘంలోను తమకు స్వతహాగా నిర్ణీతమై యున్న స్థానాన్ని తాము అలంకరించడానికి, మనం తోడ్పడ్డవాళ్ల మౌతాము.

మే. క్లా.: అంచేత స్త్రీలకు విద్య నిరర్థకమంటారా?

పా. నా.: నేననేది అదిగాదు. మన బాలికలకు చదువులు గావాలి; అవి—వారి భావిజీవితాలకీ తమ నిత్యజీవితంలో ఉపయోగించుకోడానికీ తగిన విజ్ఞానాన్నివ్వడానికి దోహదంగాక పోతే తప్ప—నిరర్థక మనడానికి వీల్లేదు. విద్యావతియైన బాలిక తన కుటుంబాన్ని సంఘాన్ని బాగుజేయాలని తాపత్రయపడాలి. విద్య బాలికలకు ధైర్యసాహసాలు నిస్సందేహంగా సమకూరుస్తుంది, వీరు ఎలాంటి జీవిత పరీక్షలకైనా ఆగగలుగుతారు, మన బాలికలకు ఇంకా ఎక్కువ విద్య గరిపించి, పై అడ్డంకుల్ని తొలగించడానికి మనకు సాధ్యంకావాలి.

మో. హె.: దేశంలో సంసారాలు సౌఖ్యప్రదంగా ఉండడానికి స్త్రీలే ఎక్కువ బాధ్యులన్న విషయం నిర్వివాదాంశం; అంచేత సంసారాలు ఆదర్శ పూర్వకంగా ఉండేటట్లు చేయడం ఏలాగో స్త్రీలకు నేర్పిస్తే, దేశ భవిష్యత్తును గురించి ఆందోళన పడనక్కరలేదు.

పా. నా.: కట్నాల సాంప్రదాయం, హిందూ బాలికల వివాహం, వారి భవిష్యత్తుల విషయం యేమిటంటారు? ఇప్పుడున్న పెళ్లిళ్ల పద్ధతులు—పూర్వంవాటి కంటె—మాట వరసకు 50 యేళ్ల క్రితం వాటి కంటె—మారే యంటారా? ఈ విషయంలో ఏమైనా అభివృద్ధి ఉందా?

మో. హె.: వివాహమంటే కొంచం యదార్థ దృష్టి వివేకాలతో పరిగణించే రోజు లొచ్చేయని అనుకుంటా. కాలేజీల్లోను స్కూళ్లల్లోనూ చదువుకున్న తల్లిదండ్రులు, తమ బాలబాలికల మానసిక ప్రవృత్తు లెరిగి, వీలైనంతవరకు, వారు వివాహానంతరం

సౌఖ్యమయ సంసారాలు సాగించేటట్లు చూస్తారు. అన్నిటికంటె ముఖ్యమైన దేమిటంటే—పిచ్చి నమ్మకాలు అపనమ్మకాలు విడిచి పెట్టడానికి విద్య తోడ్పడుతుంది. వయస్సురాని బాలికలు తమంతట తాము భర్తల్ని ఎన్నుకోగల సామర్థ్యవంతులు గారన్న విషయం యదార్థం. కాని యుక్త వయస్కులైన పిదప తమ కున్న విద్య, నాగరికతలవల్ల, తమ వివాహాల్ని గురించి తెలివి తేటలతో నిర్ణయించు కోకపోడానికి కారణం కానరాదు. ప్రేమలో అర్థిక విషయాల్ని గురించి ఆలోచించరాదు.

మే. క్ల.: మీారు మధ్య తరగతులవార్ని గురించి మాట్లాడుతున్నారు! బీదవారి సంగతేమిటి? ఈ సమస్యపై నిశితంగా పరీక్షించడంలో వారినే ముఖ్యంగా దృష్టిపథంలో పెట్టుకోవాలి.

మే. హె.: ప్రస్తుత కాలంలో కట్నాల నిర్మూలన అతి తొందరగా గావించవలసిన సంస్కరణల్లో ఒకటి. కట్నాలివ్వడానికి కాసైనా చేతిలో లేని వారుగూడా, ఎలాగో ఋణం చేసి తెచ్చి, డబ్బు—నగలు సమర్పించుకుంటూ కుటుంబాలు తీరని ఋణాల్లో ముంచేసుకుంటున్నారు.

మే. క్ల.: స్త్రీలకు వైద్య శిక్షణ సౌకర్యాల్ని గురించి కొంత చర్చిద్దామంటారా?

మే. హె.: వైద్య శిక్షణ నివ్వడానికి స్త్రీలకు ప్రత్యేక శిక్షణాలయాలు అత్యంత అవసరం, ఎందుకంటే వీటిల్లో అన్ని విషయాల్ని గురించి ఆడవారు ప్రశ్నలడిగి తెలుసుకునే టట్లు ప్రోత్సాహించి, వాటికి సరియైన జవాబు లిచ్చి వారిని మంచి పద్ధతుల్లోకి తీసుకురా డానికి వీలుంది.

మే. క్ల.: శిక్షణ కాలాలు మంచివేగాని, అవి యిప్పట్లోలాగ ఉండరాదు! వీటిల్లో కొన్ని విషయాలు స్త్రీలకు ప్రత్యేకంగా నేర్పాలి. మీరిందు కంగీకరిస్తారా?

మే. హె.: తప్పకుండాను. కాన్పుకు కాన్పుకు మధ్య కాల విలంబన ఎలా సరిజూచుకోవాలోనన్న విషయాలూ, ఇంకా వివాహం, భర్తతో కాపురం చేయడం, స్త్రీ పురుషుల మధ్యనుండవలసిన సహకారాలు మొదలైన హంశాలు తెలుసుకోవాలన్న వారికి ఉచితంగా తెలియజెప్పాలి. స్త్రీ పురుషుల మధ్యనుండ వలసిన పరస్పర సహనాల్ని గురించి చాల మంది తల్లిదండ్రులకు తెలిసింది చాల తక్కువ, ఆ తెలిసినవైనా తప్పు అభిప్రాయాలేనని చెప్పాలి. స్కూళ్లల్లో పై తరగతుల్లోను, కాలేజీల్లోను, బాలబాలికలకు స్త్రీ పురుషజాతుల మధ్య నుండవలసిన సమరసాభావాలు సంబంధాల్ని గురించి బోధిస్తే వీరి మధ్య,పరస్పర వైరుధ్యభావాలు కలహాలు పోతాయి.

మే. క్ల.: దేశంలో యువక జనుల సంఘాలు వుండడం శ్రేయస్కరం, బాలబాలికలు ఒకరి నొకరు కలుసుకొని పరస్పరంగా అర్థం జేసుకోడానికవి అవకాశాలిస్తాయి. వీరికి ఆటలూ, పనిలో విశ్రాంతి కాలాలు ఉండాలి. యూత్ లీగ్‌లు బాలబాలికలు ఒకర్నొకరు చక్కగా

అర్థం చేసుకోడానికి చక్కటి అవకాశా లిస్తాయి. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలి.

పా. నా. : మన సమస్యలు లెక్కలేనన్ని ఉన్నాయి; స్త్రీల క్షేమానికై కృషి చేయడానికీ నిర్మాణ కార్యక్రమం సాగించడానికీ, చాలా మంది తమంతట తామే ముందుకు రావాలి. ఇలా పని చేసేవారు యే విధమైన జీతబత్తేలకు మొదట్లోనే ఆశించరాదు. ప్రస్తుత కాలంలో వాలంటరీగా పని చేయడమే యెక్కువగా కావాలి.

మే. క్ల. : నేను మీతో పూర్తిగా యేకీభవిస్తున్నాను. ఇలాగ తామంతట తామే కృషి చేస్తే వచ్చే లాభాల్ని గురించి మనం ప్రచారం గావించ వలసియుంది.

మే. హె. : 'జీతాలతో పని చేయడానికి నియమింపబడ్డ సిబ్బంది'కి ప్రత్యేకంగా తర్ఫీదివ్వాలి. సాంఘిక సేవ గావించే సంస్థలకు వీరు వెన్నముకలై యుండి, వాలంటరీగా పని చేసే వార్ని యీ సంస్థల్లో యిముడ్చుకొని, వారికి శిక్షణ నివ్వాలి. మనం భవిష్యత్తుకై యేమి చేయబూనినా, గృహాల్ని మన దేశంలో ఎప్పుడూ ఏ స్థానంలో ఉంచుతున్నామో ఆ స్థానంలో నిలబెట్టడానికై యుండాలి. మన సాంప్రదాయాల ప్రకారం స్త్రీలను విశ్వాస పాత్రులైన అర్థాంగులుగాను, మాతలుగాను సంరక్షించాలి. మన అమూల్య సాంప్రదాయాలకు మనందూరమై పోకుండా యుండే విద్యావిధానం గావాలి.

★

హిమాలయాల్లో బదరీనారాయణం దగ్గర ఒక పుష్టగుండం వుంది. ఒక గుడ్డను బియ్యం చుట్టి అందులో ముంచుతే కుతకుతలాడి అన్నం తయారవుతుందట!

*　　*　　*　　*


రుమేనియా దేశంలో సంగతి. అక్కడ రైళ్లలో చుట్ట కాల్చుకునే వారికి ప్రత్యేకంగా కంపార్ట్‌మెంటు వుంటుంది. వాట్లో చుట్ట లేకుండా అందులో ఎవరైనా కూర్చున్నారంటే పదిరూపాయిలు జుల్మానా!

*　　*　　*　　*

మొదటి ప్రపంచ మహాయుద్ధంలో 85 లక్షలు చచ్చిపోయారు. 2 కోట్లపై చిల్లరకు బలమైన గాయాలు తగిలాయి. 77 లక్షలు బంధితులయారు. అంటే, యుద్ధానికి వెళ్లిన ఏడుగురు సైనికులలోను ఒకరు చచ్చిపోయాడు. ఒకడు ఖైదీ అయాడు. ఇద్దరికి దెబ్బలు తగిలాయి. మిగతా ముగ్గురు మటుకు సుఖంగా యింటికి జేరుకున్నారు.

★

అధికసంతానం........



........అభివృద్ధికి అంతరాయమా?

1. అభివృద్ధికి కారణము మానవకృషి. కృషిసలుపని మానవులు అభివృద్ధికి అంతరాయము. అంతేకాని మానవుల సంఖ్యకాదు. ఎంతమంది హెచ్చయి, కృషి సలుపుదురో అంత అభివృద్ధి.

2. బర్మా, సింహళము, గినీ, నేటాలు దేశములలో పరిశ్రమల అభివృద్ధికై పై దేశముల నుండి ప్రజ రావలసివచ్చినది. ఆస్ట్రేలియా, అమెరికా, ఆఫ్రికాఖండాలలో ప్రజలేక భూమి, గనులు, అవకాశములు బీడుపడి ఉన్నవి.

3. 1941 లో ఫ్రెంచిదేశము ఓడిపోవుటకు జన సంఖ్య చాలకపోవుట అని సేనాని రైనాడ్ అన్నాడు. సంతాన నిరోధకమును నిరశించినాడు.

4. అభివృద్ధికోరిన నాజీ జర్మనీ, రష్యా దేశములలో అధిక సంతానముగల తల్లులు ప్రభుత్వముచే గౌరవింపబడుచున్నారు. వారికి బహుమానములు ఇచ్చుచున్నారు.

5. సంతాన నిరోధకము కోరువారు తమ స్వసౌఖ్యములకై వినోదములను అభిలషించువారు.

6. సంతానవాంఛ జీవిత లక్షణమే కాక అధిక సంతానం అభివృద్ధికి అవసరం.

7. బిడ్డలను పెంచుకోలేక కష్టముల పాలగుటకు కారణము జాతి మాంద్యము, దాస్యము. భారతదేశములో ఆహారోత్పత్తికి తగు భూములు, నదులు వృథాగా పోవుచున్నవి.

8. బ్రహ్మచర్యము, సన్యాసము వ్యక్తి అహంకారములు. ప్రజాస్వామిక పురోభివృద్ధి మార్గములు కావు.

9. అభివృద్ధికి అంతరాయములు ఆర్థిక, రాచకీయ విధానములలోని లోట్లు. అధిక సంతానం అనుట హేత్వాభాస (fallacy).

10. కూలీ ప్రజలో ఎంత పెద్ద కుటుంబం అయితే అంత రాబడి.

11. అధిక సంతానం వలననే ఆరోగ్యం చెడదు.

—గోరా

★

దూరతీరం

అంతవరకూ అంతా ఒళ్ళు తెలియని ఆనందంలో మునిగి తేలుతున్నారు. కాని ఆ ఘట్టం వచ్చేసరికి ఎందుకో అందరి కళ్ళలోనూ నీళ్ళు గిర్రున తిరిగినయ్. అప్పటి దాకా ఆనందంలో మైమరచిన పెళ్ళిపెద్దల మనసులలో విషాదం ఒక్కసారిగా చెలరేగింది. ఎవరో ఒక ముత్తైదువు వణుకుతున్న గొంతుతో అప్పగింత పాట పాడసాగింది. దూరం నుంచి మేళగాళ్ళు విషాదంతో నిండి తొణుకుతున్న రాగమేదో ఆలాపన చేస్తున్నారు.

జీవితంలో విషాదచ్ఛాయ సోకని సుఖమే లేదేమో? సుఖదుఃఖాలు రెండూ అల్లిబిల్లిగా అల్లుకు పోతవేమో?

పెళ్ళికూతురు చేతులు పాలలోనుంచి పెళ్ళికొడుకు చేతులకు తాకించి పురోహితుడు యేదో మంత్రం చదివాడు. ఆక్షణంలో ఒక కొత్త జీవి వచ్చి తనలో యేకమైపోతున్నదనే భావంతో పొంగిపోతూ ఆ జీవి సుఖదుఃఖాలకు తాను బాధ్యుడనన్న భారంతో కుంగిపోతూ పెళ్ళికొడుకు గుండె దడదడలాడింది. తరవాత కోడలిని మామగారికి అప్పగించారు. ఆయన కళ్ళూ చెమ్మగిల్లినయ్. అత్తగారికి అప్పగించే సమయం వచ్చింది. కోడలు జాలిగొలిపే చూపుతో అత్తగారి ముఖాన్ని చూసింది. చెమ్మగిల్లిన చూపుతో అత్తగారు కోడలికి అభయమిచ్చి ఊరడించింది. పురోహితుడు ఊరుకోక అత్తగారి చంక నెక్కివున్న రెండేళ్ళ కుర్రాడికికూడా వొదినగారిని అప్పగించమన్నాడు. తల్లి ఒళ్ళో కూచున్న చిన్న కుర్రాడి చేతులు ముందుకి జాపమన్నారు. కుర్రాడు బెదురుతూ ముందుకి జాపిన చిన్న చేతులమీద పాలతో తడిసిన వదినెగారి చేతులు వుంచగానే, కుర్రాడు బిక్కచూపులు చూస్తూ తల్లి ముఖంకేసీ వొదినెగారికేసీ తేరిపార జూచి ఏడవటం మొదలుపెట్టాడు. కుర్రాడిని సముదాయిస్తూ అత్తగారు కోడలిని సంబోధించి "వసుమతీ ! నీకే అప్పగిస్తున్నాను వీడిని." అన్నది. ఆ మాటలు కోడలి మనసుకి భరింపలేని శక్తితో వచ్చి తాకినయ్. ఆ మాటలలో కోడలికి ఏవో వింతధ్వనులు వినిపించినయ్. ఆ మాటలు అంటున్నప్పుడు అత్తగారి ముఖంలో ఏదో వింతఛాయ కనిపించి, కోడలి గుండె చెదరి పోయింది. తన మనసులోని ఆవేదనని, తన మరది భారాన్ని స్వీకరిస్తానన్న ఆమోదాన్ని కోడలు కన్నీటితో తడిసిన ఒక వాడియైన చూపుతో అత్తగారి మనసుకి చెప్పగలిగింది. ఆ చూపులోవున్న నిష్కల్మషమైన ఆత్మనీ, నిశ్చలమైన విశ్వాసాన్ని, సుస్థిరమైన దీక్షనీ, అత్తగారు కనుగొని మురిసిపోయి తన పట్టలేని సంబరాన్ని పెదవుల మీద మెరిపించింది. ఈ మూగ చూపులలో ఎటువంటి భావాలు దాగినవో, ఆ చూపులలోనే ఎంత మహత్తరమైన వాగ్దానాలు జరిగినవో, ఆ చూపులలోనే అత్తగారికి కోడలికి జరిగిన ఒప్పందమేదో ఎవరికీ తెలియదు. వాటిలోనే భావిజీవితానికి అంకురాలు దాగి వున్నవని ఎవరికీ తెలియదు. అత్తగారికేసి కోడలూ, కోడలువైపు అత్తగారూ మూగచూపులు చూస్తూ గడపిన ఆ ఒక్క క్షణంలో ఎంతఅద్భుతశక్తి వుందో ఎవరికి తెలుసు?

రాధాదేవి రచన

అస్తమించిన తరువాతకూడా అక్కడక్కడ మబ్బుల్లో మిగిలి వుండే అరుణకాంతిలాగా ఆ అనుభవాల వెలుతురే ఇంకా వసుమతి గుండెలో మెరిసిపోతోంది. ఆ మెరుపులలో ఆమె భావిజీవితమంతా మసకగా గోచరమౌతోంది. తనకి రెండేళ్ల పసి మరదిని అత్తగారు అప్పగించింది. ఆ పసివాడి భారమంతా వహిస్తానని తాను అభయమిచ్చింది. బతుకులో తన మాట ఎంతవరకు నిలుపుకోగలుగుతుందో? వసుమతి భావిజీవితం ఏ విధంగా వుంటుందో? ఆభావిలో యీ క్షణానికెంత విలువుంటుందో?

* * *

వసుమతి పెళ్లి అయిన ఆరు నెలలకే అత్తగారు కాలం చేసింది. పుట్టింటిలోవున్న వసుమతికి అత్తగారి కెక్కువగా ఉన్నదని తెలియవచ్చింది. వెంటనే బయలుదేరి వచ్చింది కాని వసుమతి వచ్చేసరికే అత్తగారి ప్రాణం పోయింది. పసి మరదిని చేతుల్లో పెట్టుకుని తన కన్నీళ్ళను కుర్రాడికి కనబడకుండా కుక్కుకుంటూ మామగారు వసుమతి కంటబడ్డారు. అమ్మ ఏదీ అని అడుగుతున్న కుర్రాడిని మరపించేటందుకు మామగారు వసుమతి కేసిచూపుతూ "అదుగో వొదిన. ఇక వొదినే నీకు అమ్మ" అని బిగ్గరగా ఒక శోకం పెట్టాడు. వసుమతి మామగారి చేతుల్లోంచి మరదిని అందుకొనిచాటుగా తీసుకువెళ్ళింది. తల్లిని కోలుపోయిన దుఃఖముతో తల్లడిల్లుతూ భర్త ఎదురయినాడు. "ఇక వీడిభారం నీదే"నని బావురుమన్నాడు. అంతకుముందు నోరెత్తి మాటాడని వసుమతికి ఎక్కడలేని సాహసమూ లోపలినుంచిపొంగుకు వచ్చింది. ఆమె బదులు చెప్పింది "ఆ విషయమై మీరేమీ దిగులుపడవద్దు. మరది భారమంతా నాదే" అంది. వింటూ భార్య ముఖంకేసి చూస్తున్న సుందరం వసుమతి కళ్లల్లో మెరసిన నిశ్చయాన్ని చూచి చకితుడై పోయాడు. ఆ క్షణంలో అతని కళ్లకి వసుమతి యేదో వింత కాంతులతో మిరుమిట్లు కొలుపుతూ గోచరించింది.

అత్తగారు పోవటమూ వసుమతి యింటిపెద్ద కావటమూ జరిగి యెంతో కాలం కాలేదు. ఈ కొద్ది రోజులలోనే మరిది సుధాకరకి వదినగారి దగ్గర బాగా చనువయింది. తల్లిలేని కొరత వసుమతి తీర్చగలదన్న ధైర్యం సుందరానికే గాదు మామ రామశాస్త్రిగారికికూడా కలిగింది. తన ముది వయసులో కలిగిన సుధాకరని వొదినగారి చేతుల్లో వదిలేసి నిశ్చింతగా కళ్ళుమూసుకోవచ్చునని పించింది. ఒక నాటి వుదయాన కొడుకునీ కోడలినీ పిలిచి "ఇక నేనిక్కడ వుండలేను. తీర్థయాత్రకు వెళ్ళాలని వుంది. మళ్ళీ రావాలనిలేదు" అన్నాడు. ఎంత బ్రతిమాలినా వినకుండా వెళ్ళిపోయాడు. ఆయనెక్కడికి వెళ్ళాడో, ఎక్కడెక్కడ యాత్రలు చేస్తున్నాడో, ఎవరికీ తెలియదు. కొన్ని సంవత్సరాలదాకా ఆయన కబురే తెలియలేదు. తరువాత కొన్నేళ్ళకాయన సన్యసించినట్లు గాలి కబుర్లు వినవచ్చినయ్.

రామశాస్త్రిగారు యిల్లు విడిచి వెళ్ళేసరికి సుధాకరుకి మూడేళ్ళా నిండలేదు. తల్లితండ్రు బిడ్డలకి ఎవరైన ఆ పసివాడికి వసుమతి సుందరమూ తల్లితండ్రులయినారు. తమ్ముని బాధ్యత సుందరానికి చేదనటంలేదు. కాని ఆ పసివాడిని పెంచి పెద్దవాడిని చేసే భారమంతా, ఆ నాటినుంచి వసుమతే వహించింది. వసుమతి చేత్తో కలిపి పెడితేగాని సుధాకర ముద్ద నోట పెట్టేవాడుకాదు. వసుమతి జోలపాడితే గాని కన్ను మూసేవాడుకాదు. క్షణమైనా వసుమతిని విడిచేవాడుకాదు. తన చేతులతోనే సుధాకరకి అన్ని పనులు తాను తల్లిలాగా చేయాలి. తెలియనివారెవరైనా చూస్తే సుధాకర తల్లిలేని పిల్లడనిపించకూడదు. తనే తల్లిలాగా మరది చుట్టూ అల్లుకుపోయింది.

వదినగారు తన తమ్ముణ్ణి, యీ విధంగా సాకుతుందని సుందరం రెన్నడూ అనుకోలేదు. ఒక నాడు సుధాకరకి తల దువ్వుతున్న వసుమతిని చూసి "వసుమతీ! మా అమ్మ లేదని ఒక్కనాడయినా అనిపించకుండా చేశావు. మా తమ్ముణ్ణి యింత ప్రేమతో పెంచుతావని నేను కలలో నయినా అనుకోలేదు. కాని ఒక ప్రశ్న అడుగదలచుకున్నాను అన్నాడు. "తప్పక అడగండి" అని వసుమతి భర్త ముఖంకేసి చూసింది. సుందరం తటపటాయించి తడబడుతూ "నీకు బిడ్డలు కలిగి నప్పుడు—? అని సగంలోనే ఆగిపోయాడు. వసుమతి భర్త మనసు వెంటనే తెలుసుకో గలిగింది. "మీకీ సంశయం అక్కర్లేదు. ఈ బిడ్డమీద ప్రేమను నా బిడ్డలుకూడా తగ్గించలేరు." అంటూవుంటే

ఆమె చెవుల్లో ఆనాటి అత్తగారి మాటలు గింగురమన్నాయి. సుందరం కోంటిగా "మూర్ఖంగా—" అన్నాడు.

అన్నట్టుగానే కొద్ది రోజులలోనే వసుమతి గర్భం ధరించింది. ఎంత బ్రతిమాలినా పురిటికి పుట్టింటికి వెళ్ళనన్నది. చివరకు మరదినికూడా వెంటబెట్టుకొని వెళ్ళక తప్పిందికాదు. పుట్టింటి వారికి వసుమతి మరదిమీద చూపే ఆపేక్ష చిత్రంగావుంది. ఎడపిల్లడిమీద ఓపలేని తల్లికూడా చూపనంత శ్రద్ధా, చెయ్యనంత పోషణా వసుమతి సుధాకర మీద వర్షించడం చూసి అంతా నివ్వెరపోయారు. లేని ఓపిక తెచ్చుకొని యెన్నో కథలు చెబుతూవుండేది. ఒకనాడు వసుమతి తల్లి, కూతురు వద్దకువచ్చి "బాగానేవుంది యీ పోరు—అత్తపోరు, మామపోరు లేకపోయినా, మరదిపోరు మాత్రం తప్పలేదు. క్షణమైనా విడవకుండా కూడా కూడా తిరుగుతూ వేపుకుతింటాడేమే? ఇదెక్కడి పిల్లడు బాబూ" అన్నది. ఇదంతా వసుమతికి ఇంపుగా వుంటుందని ఆమె ఆశపడింది. మరదిలో వసుమతి వేగలేకుండా వున్నదనీ, తన సానుభూతిని చూసి సంతోషిస్తుందనీ, ఆ వెర్రి యిల్లాలనుకొన్నది. ఈ మాటల ధాటి తనమీదనే నని బెదరుతూ అమాయకంగా వొదినగారి ఒడిలో తలదాచుకున్నాడు సుధాకర. బెదరుతున్న మరది తలను మెల్లిగా నిమురుతూ "అమ్మా అల్లాగయితే నేనీ క్షణమే మా యింటికి బయలు దేరుతున్నాను. ఇక్కడ ఇక క్షణంకూడా వుండను." అని కోపంతో అని వెంటనే అత్తవారింటికి బయలుదేరింది. తండ్రి వచ్చి యెంతో బ్రతిమాలుకున్నాడు. అన్నగారు వచ్చి వసుమతిని వెళ్ళవద్దని యెంతో అనునయించాడు. తల్లి "నా వలన తప్పయింది. ఇక అనవసరంగా మా తల్లినిగదూ వెళ్ళబోకు" అని ఎన్నోవిధాల ప్రాధేయపడింది. వసుమతి ఏదనుకుంటే అది జరిగి తీరాలిసిందే. ఎవరు వారించినా వినలేదు.



నేడో రేపో కనేటందుకు సిద్ధంగావున్న వసుమతి తిరిగి రావటంచూసి సుందరం ఆశ్చర్యపోయాడు. కాని వూళ్ళో కలరాలున్నవని తనే అత్తవారింటికి వెళ్ళాలనుకుంటున్న సమయంలో అనుకోకుండా వసుమతి రావటం చూచి సుందరం కలవరపడ్డాడు. ఏమికానున్నదోనని లోలోపల యెంతో భయపడ్డాడు.

భయపడినట్లుగానే వచ్చిన మరునాడే సుధాకరకి డోకులూ విరోచనాలు మొదలయినవి. డాక్టరు వచ్చి కలరా అని నిర్ణయించి సెలయిన్ ఇంజక్షన్ యివ్వడం మొదలెట్టాడు. నెలలు నిండిన వసుమతి ఎందరు చెప్పినా వినలేదు క్షణమైన సుధాకరను విడిచేదికాదు. అయిదేళ్ళ పిల్లడు బాధకు తల్లడిల్లుతూంటే వసుమతి గుండె ఝల్లుమనేది. ఇన్నాళ్ళూ వున్నది. ఆ నాడు తల్లిమాటలకి కోపగించుకొని ఎందుకు వచ్చేయాలి? అక్కడే వుంటే సుధాకరకి కలరారాకుండా తప్పేది కదా? తనే కారణం కదా? ఇప్పుడేం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? సుందరం వసుమతి నవతలికి వెళ్ళమని మందలించాడు. కన్నీళ్ళతో తడిసిన జాలిచూపుతో వసుమతి భర్త గుండెలు కరిగిపోయేటట్లుగా చూసింది. "మీ అమ్మగారుంటే పిల్లడినిటువంటి స్థితిలో వదిలేసి దూరంగా కూచునేవారా?" అని ప్రశ్నించేసరికి సుందరం నోటమాట లేకుండా నిలబడిపోయాడు.

మరదికి అపాయం తప్పినదని విన్న కొన్ని గంటలకే వసుమతి సుఖంగా కన్నది. వసుమతికి స్మృతి వచ్చిన మరు క్షణం తన శిశువుని చూచుకొని మురిసిపోయింది. తెల్లవారగానే యెల్లాగో లేచి మంచందిగి ద్వారం దగ్గర నిలబడి ఎదురుగా హాలులో మంచంమీద పడుకొని వున్న మరదిని చూసి "సుధా" అని కేక పెట్టింది. వొంట్లోవున్న వూపిరంతా "వొదినా!" అన్న ఒక్క పిలుపుతో సుధాకర లోపలనుంచి పరుగెత్తుకొచ్చింది. ఆ పిలుపులో తల్లి చేతుల లోని దూకే పసిపిల్లడి ఆవేశమున్నది. అది విని వసుమతి "సుధా! లేవబోకు" అనగానే సుధాకర వొదినగారి వైపుకు ఒత్తిగిల్లి జాలిగా చూశాడు. అటువైపు చూస్తున్న వసుమతికి తనకు తెలియకుండానే కళ్ళు తడిసినవి. ఈ రెండు గుండెలలోని తలపులనూ తెలుసుకోవాలని సుందరం మనసు తపించసాగింది.

ఆ నాడు సుందరం కొంటెగా అన్న మాట అనుక్షణమూ మనసులో మెదిలేది. నీకు బిడ్డలు కల్గినపుడుకూడా మరది నీవిధంగా చూస్తావా? అని సవాలు చేశాడు. తన మరది మీద అపేక్షను తగ్గించగల శక్తి బిడ్డలకుకూడా వుండదని, నిబ్బరంగా చెప్పింది. ఇపుడా మాటలు అక్షరాలా నిజమని, నిరూపించాలి. తన బిడ్డ పోషణవల్ల మరది పోషణ కెక్కడ లోపం జరుగుతుందోనని మునుపటి కంటే సుధాకరను జాగ్రత్తగా కనిపెడుతోంది. మరదికి, అన్నం నీళ్ళు మునుపటి మాదిరిగానే కనుక్కుంటోంది. ఒక చేత్తో తన కొడుకు తొట్టి వూపుతూ, రెండో చేత్తో తన దగ్గర చాపమీద పడుకొన్న మరది వీపుమీద జోలకొడుతూ యిద్దరిని నిద్ర పోగొట్టేది. అందువలనే సుందరం "వసుమతీ! నువ్వు సామాన్యురాలివి కావు" అన్నాడు ఎన్నోసార్లు. ఆ మాటలలో ఎంతో సత్యమున్నది. కనుకనే వూరివారంతా వసుమతి నెంతో గౌరవిస్తారు. కన్న బిడ్డమీదనయినా అంత అపేక్ష చూపటం కష్టమని అంటూవుంటారు. ఎవరెన్ని అన్నా సరే వసుమతి తన విధి ఎన్నడూ మరచిపోలేదు. ప్రతి రాత్రి సుధాకర నిద్ర పోయిన తరువాత అతనిమీద దుప్పటి కప్పి పక్కలో కొంచెంసేపు కూచుంటుంది. అప్పుడు ఆమె మనస్సు అప్రయత్నంగా అత్తగారి దగ్గరకు పరుగెత్తుతుంది.

బళ్ళోచేరిన దగ్గరనుంచి సుధాకర ఎక్కడలేని అల్లరీ నేర్చుకున్నాడు. అంత చిలిపిపిల్ల డావూళ్ళోలేడని పేరు తెచ్చుకున్నాడు. బడివిడవగానే ఒక్కనాడయినా సూటిగా యింటికి వచ్చేవాడుకాదు. విడవకముందే పారిపోయి అల్లరిపిల్లలతోకలిసి దేవుడు గుళ్ళో ఆటలాడుతూ వుండేవాడు.

పదేళ్ళు నిండినా సుధాకర పాండిత్యం కాగుడింతాన్ని దాటిపోవటంలేదు. అల్లరిమాత్రం అన్నిటినీ దాటిపోతోంది. సుందరం వసుమతి మీదెన్నోసార్లు విసుక్కున్నాడు. నువ్వే వాడికి అల్లరి నేర్పుతున్నావన్నాడు. అన్నిటినీ వసుమతి సహించివూరుకున్నది. కాని సుందరం "వసుమతీ! నువ్వే సుధాకర చెడిపోవటానికి కారణమన్నపుడు మాత్రం ఆమె మనసు చివుక్కుమన్నది "నా తప్పేమిటో చెప్పండి?" అని అడిగింది. సుందరం తీవ్రంగా అన్నాడు "వసూ ఇవాళ తెలియదు. నీ చనువుని ఆసరాచూసుకొని వాడు రేపు యెందుకూ కొరగాకుండాపోతే అప్పుడు తెలిసివస్తుంది." వసుమతి తలవంచుకున్నది. ముఖం జేవురించింది. ఏమి అనాలో, ఏమిచేయాలో తోచలేదు. తనకంటే సుధాకర బాగుకోరేవారెవరున్నారీ లోకంలో? తనప్రేమయే అతనికి శత్రువుగా పరిణమిస్తే తనకింకేది త్రోవ.

ఆ సాయంకాలము సుదర్శన "అమ్మా" యని అరచుకుంటూబడినుంచి యింటికి పరుగెత్తుకొని వచ్చాడు. సుధాకరకేమైన ప్రమాదం జరిగిందేమోనని, వసుమతి కలవరపడింది. ఇంట్లోకి వస్తూనే "అమ్మా అన్నయ్య బీడీ కాలుస్తున్నాడు. నీకు చెబుతానంటే నన్ను చంపుతానన్నాడు. నేను పారిపోయివచ్చాను," అని రోజుకుంటూ చెప్పాడు. "అరవకు, నోరుమూసుకో, ప్రాణంపోయినట్లు పరుగెత్తుకొచ్చావు పాపం ఈ పితూరీ చెప్పేందుకేనా?" అని వసుమతి కళ్ళెర్రజేసి కొడుకునోరు నొక్కింది. ఇంతలో వాకిట్లోవున్న సుందరం ఈ మాటలువిని లోపలకువచ్చి "బాగానేవుంది చెప్పినందుకు వాడిని కేకలేస్తావెందుకు? వాడయినా నిజంగా బీడితాగాడు? అయితే వెధవనిరానీ ఇంటికి, తొక్కి నారతీస్తాను." అని అరచాడు. వసుమతి మారుచెప్పలేదు. నిజంగా సుధాకర బీడీలు తాగుతుంటే

తాను చూస్తూ వూరుకుంటే ఎల్లా? తప్పక శిక్షించాల్సిందే.

“నే నేమీ అనను. మీ యిష్టము వచ్చినట్లు దండించండి.” అని వసుమతి అక్కడినుంచి వెళ్ళిపోయింది. మరుక్షణం నోరు జారినందుకు నాలిక కరుచుకుంది.

*   *   *

తెల్లవారిలేచి చూచేసరికి అన్నగారు ఏదో ప్రయాణ సన్నాహంలోవున్నట్లు సుధాకర పసిపట్టాడు. ఒక పెట్టెలో వదినగారు తన చొక్కాలాగూలు సర్దుతూవుండేటంచూసి కంగారుపడ్డాడు. ఇంతలో సుదర్శనవచ్చి “అయిందిలే అబ్బాయి పెళ్ళి” అన్నాడు. అర్థం తెలియకపోయినా సుదర్శనుని మింగివేద్దామన్నంతకోపం వచ్చింది. ఇంతలో వదినగారువచ్చి “లేసుధా! దబ్బున నీళ్ళుపోసుకుని భోజనానికిరా” అన్నది. ‘ఎక్కడికి వదినా’ అని సుధాకర జాలిగా అడిగాడు. వసుమతి బదులు చెప్పలేకపోయింది.

భోజనమయేసరికి బండి వచ్చింది. సామాన్లు బండిలో కెక్కినయ్. వసుమతి సుధని గట్టిగా కౌగలించుకొని “వెళ్లిపోతున్నావా నాయనా? జాగర్తగావుండు, శ్రద్ధగా చదువుకో” అంటుండగానే సుందరం తమ్ముడి రెక్కపుచ్చుకొని గుంజుకుపోయి బండి ఎక్కించాడు. తనుకూడ యెక్కి బండి పోనియ్యమన్నాడు. బండి కదిలే సమయానికి సుధాకర పట్టలేక వదినా అని ఒక్కశోకం పెట్టాడు. “నోరుముయ్యి” అని సుందరం గదిమాయించాడు. వసుమతి బండి కంటికందినంతవరకూ చూస్తూ కొయ్యలాగా నిలబడిపోయింది. ఆమె ప్రాణం యెగిరిపోయింది. ఆమె చప్పున అక్కడే కూలబడిపోయింది. అత్తగారికి తాను యిచ్చిన మాట నిలుపుకోలేక పోతున్నానన్న అవమానమూ, దుఃఖమూ ఆమెను పెనగొని తలక్రిందులు చేస్తున్నయ్.

తమ్ముడిని బుచ్చివేలీ స్కూలులోదింపి కట్టుదిట్టాలన్నీ చేసి సుందరం ఇంటికి తిరిగివచ్చాడు. వచ్చేసరికి సుమతి వసుమతి మంచమెక్కివున్నది. జ్వరం కాలిపోతోంది. సుధా అన్న కలవరింత తప్ప వేరే మాటలేదు. చూడగానే సుందరానికి చిత్రం వేసింది. ఎందుకూ కొరగాని ఒక అల్లరి పిల్లవాడికోసం వసుమతి తన బ్రతుకంతటినీ ఈ విధంగా అర్పించుకోవట మెంత వెర్రి! తల్లిలేని పిల్లడయితేమాత్రం ఇంత వెర్రి ఆపేక్షయెందుకు?

అన్నగారు దిగవిడచివచ్చిన తరువాతివారం తిరక్కముందే సుధాకర సామానంతా బుచ్చివేలీలో వదిలేసి చెప్పకుండా ఇంటికి పారిపోయి వచ్చాడు. వచ్చీ రావటంతోనే మంచమెక్కిన వదినగారినిచూచి బావురుమన్నాడు. వసుమతి వచ్చావా సుధా అని పెగుల్చుకొని ఒక్కకేక పెట్టి వణుకుతున్న చేతుల్తో సుధాకర ఒళ్ళంతా నిమిరింది. “ఎంత చిక్కిపోయావు సుధా” అని అంటూండగానే వైద్యుని తీసుకునిరావటంకోసం వెళ్ళిన సుందరం తిరిగివచ్చి తమ్ముణ్ణిచూసి నివ్వెరపోయాడు. అన్నగారినిచూసి సుధాకర గజగజ వణికిపోయాడు. కోపమంతా అణచుకొని “ఏరా ఎందుకువచ్చావ్” అని కసిరాడు. సుధాకర “వదినెను చూచేందుకు” అని బెదురుతూ చెప్పాడు. అది వింటూన్న వసుమతి మనసు పూర్ణిమనాటి సముద్రంలాగా ఒక్కసారి పొంగిపోయింది. “చూడండీ ఎంత చిక్కిపోయాడో సుధ” అన్నది వసుమతి. సుందరానికి చిక్కినట్లు తెలియటంలేదు. హేళనగా అన్నాడు “సరిపోయింది యీ వదినగారికీ ఆమరిదికీ!” వసుమతి మనసు చివుక్కుమన్నది.

ఏళ్లు గడచిపోతున్నయ్. కాని సుధాకరలో ఒక్క మంచి గుణమయినా కనబడటం లేదు. ఊరివారంతా అతన్ని చూచి ఏవగించుకుంటున్నారు. సుందరానికిగూడా తమ్ముడు తాగుబోతులతోనూ, జూదరులతోను, తిరుగుబోతుల తోనూ కలిసి తిరుగుతున్నాడని అసహ్యం పుట్టింది. నోరెత్తి పలుకరించటంకూడా మానేశాడు. సుధాకరకి ఎవరన్నా భయంలేదు. ఎవరిమీదా భక్తిలేదు. ఎవరినీ లక్ష్యంచేయడు. కాని వదినగారి పేరు చెపితేమాత్రం పిల్లి అయిపోతాడు! వసుమతి నోటిమాటకు తప్ప మరిదేనికీ జంకడు.

వసుమతి కన్నకొడుకు సుదర్శన చక్కగా చదువుకుంటూ గబగబా పైకి వచ్చాడు. బస్తీలో స్కూలుఫైనలు చదువుతున్నాడు. అతనికంటే ఆరేళ్లు పెద్దవాడయిన సుధాకర మాత్రం పల్లెటూరులో ఎందుకూ కొరగానివాడయిపోయి కాలం వ్యర్థం చేస్తున్నాడు. ఆనాడే సుదర్శనం యింటికి శలవలకివచ్చాడు. ఎంత రాత్రయినా సుధాకర యింటికి

రాలేను. అందరూ చెప్పేమాటలు నిజమేనోనని తెలుసుకోవాలని వసుమతి మనసు తహతహలాడింది. సుధాకర ఆవేళప్పుడెక్కడవున్నాడో చూసిరావాలని కొడుకుని వెంటపెట్టుకుని చిమ్మచీకటిలో, లాంతరు పుచ్చుకుని, బయలుదేరింది. సగం దోవలో అమ్మోఅని కేకవేసి వెనక్కి విరుచుకుని పడింది. చేతులోంచి లాంతరుజారి కిందపడింది. ఆమసక చీకటిలో పారిపోతున్న తాచునుచూసి సుదర్శన గొల్లుమన్నాడు. అప్పుడే ఇంటికి తిరిగివస్తున్న సుధాకర ఒక్కదూకులో అక్కడికివచ్చి పారిపోతున్న పాము పడగని చితక్కొట్టేశాడు. వదినగారిని చేతులమీద యింటికి మోసుకుపోయాడు. ఆ చీకటిలో తనని వెతుక్కుంటూ వస్తున్నదని సుదర్శనచెప్తే సిగ్గుతో కుమిలిపోయాడు. భగవంతుడా మా వదినను రక్షించు. నా తప్పులకి నన్ను శిక్షించు. మావదినను రక్షించు. నేను పాపిని. నన్ను చీల్చి చెండాడు. అని అపుకోలేని శోకంతో తల్లడిల్లి పోయాడు. ఇంటికి వెళ్ళగానే జనం చుట్టేశారు. ఈ చీకటిలో, ఆ కుదురులేని మరదికోసం ఎందుకు పడిపోవాలని కొందరు పెదవివిరిచారు. కొందరు వూళ్ళోవున్న మందులన్నీ పోస్తున్నారు. తమ్ముడిని పీకపిసికేద్దామని సుందరం చిందులు తొక్కుతూ, నలుమూలలు వెతికాడు. అప్పటికే సుధాకర గుండెలు పగిలేవేగంతో రైలుస్టేషనుకి పరుగుతీస్తున్నాడు. ఎప్పుడో స్టేషనులో పాముల నరసయ్య వున్నాడనీ, పాము కరచినదని చెప్పగానే, పై పంచచింపి దగ్గరున్న చెట్టు కొమ్మకు వేళ్ళాడకడతాడనీ, వెంటనే మనిషి బతుకుతాడనీ, విన్నాడు. ఆకలితో అడుగుసాగటంలేదు. గుండెబ్రద్దలయిపోయేట్లు మోగుతోంది. తను చచ్చినాసరే, వదినగారిని బ్రతికించాలని ఆగకుండా పరుగు తీశాడు. నాలుగు మైళ్ళున్న స్టేషనుకి అరగంటలో చేరుకున్నాడు. నోట మాటరావటంలేదు. గుండెలు పగిలిపోతున్నయ్. మాష్టరుగారి కాళ్లు పుచ్చుకుని "మావదిన......తాచు..." అని పెగుల్చుకుని చెప్పి నేలమీద సొమ్మసిల్లి పోయాడు. మంత్రగాడు వచ్చినమనిషి ఆందోళనను గ్రహించి వెంటనే పైపంచ చింపి మంత్రించి కొమ్మకు కట్టాడు. "మీ వదిన బ్రదుకుతుంది. భయం లేదన్నాడు. సుధాకరకుపోయిన ప్రాణం ఒక్కసారి లేచివచ్చినట్లయింది. వచ్చినంత తొందరగా యింటికి పరుగుతీశాడు. ఇల్లు చేరుకునేసరికే వదినగారికి ప్రమాదం తప్పింది, విషం దిగిపోయింది. అమ్మయ్యా అనిఒక పెద్ద నిట్టూర్పువిడిచి వదినగారి కాళ్లమీద వాలిపోయాడు. చుట్టూ మూగిన జనమంతా విస్తుపోతు నిలబడిపోయారు. సుందరానికికూడా ఆ క్షణంలో తమ్ముడిని చూడగానే ఎక్కడలేని జాలీవచ్చి ఆవరించింది.

"వదినా నాకు బుద్ధి వచ్చింది" అని సుధాకర తల వంచుకున్నాడు. "నా తప్పులన్నీ మన్నించు" అని వెక్కివెక్కి ఏడ్వసాగాడు.

కొన్నాళ్లు గడచినయ్. సుధాకర యిల్లు కదలడంలేదు. అస్తమానం అన్నగారి కొడుకువద్ద కూచోని చదువు నేర్పుకోటం మొదలెట్టాడు. వసుమతి ఎంతో వుప్పొంగిపోయింది. సుందరం ఎంతో ఆశ్చర్యపోయాడు. వదినగారికి ప్రాణాపాయం వచ్చినప్పుడు క్షణంలో సుధాకరకి తనమీద తనకు కల్గిన ఏవగింపు, రోత, అతన్ని వీడటం లేదు. తనవంటి పనికిరానివాడికోసం వసుమతి అంత పరితపించటం, తన కోసం వసుమతి ప్రాణాపాయాని గురికావటం, భగవంతుడా మా వదినని రక్షించు అని తాను ఏడవటం, తన వదినను బ్రతికించటంకోసం తాను పడ్డ కష్టం, ఆమె బ్రతకదేమోనని తాను పడ్డ భయం, అన్నీ అతన్ని కలవర పెట్టసాగినయ్. అటువంటి వదినగారి అనురాగానికి, తగిన గుణమింకొకటయినా తనలో లేదే అన్న చింత అతన్ని వేధించసాగింది.

వసుమతి యింటిపని చేసుకుని పక్కవద్దకు వచ్చింది. నిద్ర పోతున్నారు. ఒక్క సుధాకర మాత్రం ఆకాశం కేసి చూస్తూకూచున్నాడు. చెక్కిళ్ల మీదుగా కన్నీళ్లు కారుస్తూ వసుమతి వెనకగా వెళ్ళి "సుధా ఏమిటిది? ఎందు కేడుస్తున్నావ్?" అని అన్నది. సుధాకర మాట్లాడ లేదు. "నా ముందు నీకు దాపరిక మెందుకు సుధా, చెప్పు నీ మనసులో యేమున్నదో" అని బుజ్జగించింది. సుధాకరకు ధైర్యం వచ్చింది. భయంపోయింది. "వదినా నీ నగ యేమయిన పోయిందా?" అని అడిగాడు. వసుమతి చకితురాలయి "ఎక్కడకు పోతుంది" అన్నది. సుధాకర

వణుకుతున్న గొంతుకుతో "నేను ఎత్తుకుపోయాను. నీవు చూచుకోలేదు గదూ. ఈ తప్పుకు తగిన శిక్ష యేమిటో చెప్పు వదినా" అన్నాడు. వసుమతి తొణుకుబెణుకు లేకుండా "నీవు తీసుకోపోయి ఏం చేశావో చెప్పితే నేగాని శిక్ష యేమిటో చెప్పను" అన్నది. సుధాకర బెదరిపోయాడు. సిగ్గుపడిపోయాడు. ఎంతకీ చెప్పలేదు. చివ్వరి కెవరి కిచ్చాడో బలవంతంమీద బైట పెట్టాడు. వసుమతి "అమ్మ దొంగా ఎంత పని చేశావూ? దీనికి ఒక్కటే శిక్ష, అది అనుభవించి తీరాలిసిందే, తప్పదు" అన్నది. సుధాకర బెదరిపోయాడు "ఏమిటో చెప్పు వదినా?" అని ఎంతో బ్రతిమాలినా, వసుమతి "ఇప్పుడు చెప్పను, ఆ శిక్ష అనుభవించాలిసిందే, తప్పదులే" వెళ్ళిపోయింది.

వసుమతి సుధాకరకి వేసిన గొప్ప శిక్ష ఏమిటో ఊహించటం కష్టం కాదనుకుంటాను. వదినెగారి నగ ఎత్తుకుపోయి సుధాకర తాను వలచిన సుందరికి కానుక ఇచ్చాడు. ఈ సంగతి మరది సిగ్గుపడుతూ తనతో చెప్పిన క్షణమే వసుమతి మనసులో ఒక మెరుపు మెరసింది. ఎల్లాగయినా సరే సుధాకరకీ సుందరినిచ్చి పెళ్లి చేయాలని. ఏర్పాటులన్నీ త్వరత్వరగా జరిగిపోతున్నాయి. తాను కలలోకూడా అనుకోని శిక్ష పడింది సుధాకరకి!

పెళ్లి సలక్షణంగా జరిగింది. అందరి కళ్లలోనూ నీళ్లు చిందించే అప్పగింతల సమయం వచ్చింది. వసుమతి మనసు పట్టలేని ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది అంతవరకూ. ఆక్షణంలో అత్తగారు తలపుకు వచ్చి ఆమె కళ్లలో నీళ్లు తిరిగినయ్. తన పెళ్లి నాటి ఘటనలన్నీ కన్నీళ్లతో కలసి గిర్రున తిరుగుతున్నయ్. ఇంతలో సుందరి చేతులు పాలలో నుంచి వసుమతికి అప్పగించే తరుణం వచ్చింది. వసుమతి ముఖంలో ఏదో వెలుగు వెయ్యి మెరుపు లొక్కసారి మెరిసినట్లుగా ధగధగమన్నది. కనుగొనలలో నీళ్లు తొణికినయ్. వసుమతి ముఖంమీగది నుంచి జారి సుందరి చేతుల మీద చిందినయ్. "అమ్మా సుందరీ మా సుధ పసివాడు, వాణ్ని నీకు అప్పగిస్తున్నాను" అంటూ వసుమతి కన్నీళ్లతో తడిసిన చూపుతో సుధాకరనీ సుందరినీ చూసింది. ఆ చల్లని చూపులో సుధ క్షణంలో పసిపిల్లవాడయి పోయాడు! వదిన గారి ముఖంకేసి చూడగానే అమాంతంగా ఆపుకోలేని దుఃఖం వచ్చి సుధముఖం జేవురించింది. అతనికేసి చూసి వసుమతి మూలగాలి సోకిన మబ్బులాగా కరిగిపోయింది. ఈ కన్నీళ్లలో దుఃఖం లేదు. పట్టలేని ఆనందం, వర్ణనకందని శాంతి, గమ్యం చేరుకున్న తెరువరి మనసులో పెల్లి విరిసే సంతృప్తి ఆ కన్నీళ్లలో దాగి వున్నవి కదూ?



విజయలక్ష్మి వీరగర్జన! స్వతంత్ర భారతదేశ ప్రథమ ప్రతినిధి శంఖారావమునకు అంతర్జాతి సమితి నివ్వెరపోయింది. పోరాటానికి జంకని పుష్టరక్తం ఆమెది. స్మట్సు సేనాని అంతవాడు సిగ్గుతో తలవంచుకున్నాడు. ధర్మానికి విజయం చేకూర్చి భారతదేశ ప్రతిష్ఠను నిలబెట్టి దలచిన విజయలక్ష్మిని అనన్య దేశ ప్రతినిధులు అభినందించారు.

ఆమె సందేశం శాంతి సందేశం. దక్షిణాఫ్రికా భారతీయులకు మానవ హక్కుల నివ్వని స్మట్సు ప్రభుత్వం నాగరిక ప్రభుత్వం కాదని లోకానికి చాటింది. ఆ ప్రభుత్వానికి నీతిగరపి భారతీయులకు న్యాయం చేయలేక పోతే ప్రపంచ శాంతి మహాసభ భగ్నమైనట్లే అని వెల్లడి చేసింది. స్మట్సు ప్రభుత్వం తెల్ల దొరతన మనీ, ఆ దొరతన పలుకుబడీ, బలమూ వుందనీ భయపడేవాళ్లం కాము; అతనినీ, అట్టి ప్రభుత్వాలనీ లొంగదీసే శక్తి మాలో వుంది అని గర్జించింది.

మేము యిన్నాళ్లూ బ్రిటీషు తాబేదారీలో వుండడం చేత యీ ఆటలు సాగాయి. పరిస్థితులు మారిపోయాయని జ్ఞాపకం వుంచుకోండి! నల్లవారిని తృణీకరించ గలిగే రోజులు తిరిగిరావు. భారతదేశం ఆసియాఖండానికి నాయకత్వం వహించి తెల్లవారికీ ప్రపంచానికీ శాంతి భిక్ష పెడ్తుందని జోస్యం చెప్పింది.

—ఆ జోస్యం యొక్క నిజం తెలుసును కాబట్టే రష్యా చైనా దేశాలు విజయలక్ష్మి వీరగర్జనకు జోహారు లిచ్చి భారత దేశానికి తోడ్పడ్డాయి.

'విజ్ఞానం' మానవాభ్యుదయమునకు హేతువు!

చర్చలో పాల్గొన్నవారు:

శ్రీమతి బి. కృష్ణవేణమ్మ, బాల,

★ లక్ష్మి, సుగుణమణి, మైత్రి, రత్నమ్మ, ★

శతకీర్తి, అన్నపూర్ణ, అనసూయ.

ఆంధ్ర మహిళాసభ తెలుగు వాగ్వివాదశాఖ సమావేశము శ్రీమతి బెన్నూరి కృష్ణవేణమ్మ గారి అధ్యక్షతను జరిగింది.

"విజ్ఞానశాస్త్రము మానవాభ్యుదయమునకు హేతువు" అను విషయముమీద చర్చ జరిగినది. శ్రీమతి బాలగారు (ఇంటరు విద్యార్థిని) మానవ అభ్యుదయమునకు విజ్ఞానశాస్త్రమే కారణమనిరి. విజ్ఞానశాస్త్రమనగా, పంచభూతముల సంబంధం ఉపయోగం తెలియపర్చేదని చెప్పి, వానియొక్క భాగములను వివరించి, మానవుడు వీటిమీద యే యే విధముల ఆధారపడియున్నది చెప్పినారు. ఈ శాస్త్రములో ఒక భాగమైన భౌతిక శాస్త్రము ద్వారా, శాస్త్రజ్ఞులు మానవజీవిత సౌకర్యములగు స్టౌ, ఎలక్ట్రిసిటి యంత్రములు, కాలక్షేపమునకు, వార్తలు తెలియుటకు రేడియో మొదలైన యంత్రములు కనిపెట్టి అభ్యుదయ కారకులైనారు. వైద్య శాస్త్రజ్ఞులు, చనిపోయిన మనిషిని, ఒకటి రెండు గంటల కాలము Atomic energy ద్వారా బ్రతుకునట్లు చేయు విధానము కనిపెట్టిరనియు, యిదే విధముగా, ఎన్నో పద్ధతులు అన్ని విషయములలో కనిపెట్టుటకు కారకమైన విజ్ఞానశాస్త్రము మానవ అభ్యుదయమునకు హేతువు అని చెప్పి విరమించిరి.

శ్రీమతి లక్ష్మి (జూనియర్ క్లాసు విద్యార్థిని) పైవారి వాదన సమర్థిస్తూ తప్పక విజ్ఞానశాస్త్రము మానవ అభ్యుదయ హేతువనిరి. సినీమాల ద్వారా ప్రజలకు మంచి చెడ్డలను, కనులకు కట్టినట్లు తెలియ చేసి, వారియందు సంస్కారము కలిగించుటకు వీలనియు, ఇంకా యితర దేశ పద్ధతులుకూడ తెలిసికొనవచ్చునవియు, వీటి కన్నింటికీ మూలమైన శాస్త్రజ్ఞానము అభ్యుదయమేనని విరమించిరి.

శ్రీమతి సుగుణమణిగారు పై వాదనలను ఖండించుచు, విజ్ఞానం మానవ అభ్యుదయమునకు హేతువు కాదు, మానవపతనమునకే దారి తీసినదనియు, మన హిందువులకు విజ్ఞానశాస్త్రం అనగా సమగ్రమైన విజ్ఞానాన్ని చ్చేదనియు పాశ్చాత్యులకు భౌతిక శాస్త్రము మొదలగునవి ప్రాధాన్యమనియు, హిందువులు భౌతికేతరమునకే యెక్కువ ప్రాముఖ్యత యిచ్చిరనియు, భౌతికేతరం అనగా, శరీరమునకు సంబంధించినది గాక, మనస్సునకు సంబంధించినదనియు, మానసిక సంస్కారము కలిగిననాడే అభ్యుదయమనియు, పాశ్చాత్యుల శాస్త్రము, మానసిక సంస్కారమునకు అంతగా సహాయపడక మానవుని పతనానికి దారితీస్తోందనియు చెప్పారు. ఇలాంటి పరిస్థితులవల్ల మానవునిలోనున్న

మానవత్వంపోయి రాక్షసత్వం వస్తూవుందన్నారు. సర్. సి. వి. రామన్ అంతటివాడు, "ఆటంబాంబు పరీక్షలకు ఖర్చు పెట్టే ధనం, దేశ దారిద్రం పోగొట్టడానికి, నిరుద్యోగ సమస్య నిర్మూలనానికి వుపయోగించి వుంటే బాగువుండి వుండు" నని చెప్పాడనియు, ఇంగ్లండులో కూడా యిటీవల యూత్ లీగ్ ఒకటి యేర్పడి, పూర, పూరా గాంధీ చెప్పినట్లు Simple living and high thinking వుండాలని ప్రచారం చేస్తున్నారనియు చెప్పి విరమించారు.

కుమారి మైత్రిగారు (ఇండస్ట్రియల్ సెక్షన్ విద్యార్థిని) సుగుణమణిగారు చెప్పినట్లు పతనానికి దారి తీస్తోందన్న వాదనను సమర్థిస్తూ నిరుద్యోగ సమస్య సోమరితనం దేశంలో యెక్కువ అవుతున్నాయని సినీమాలవల్ల అనవసర ఖర్చు, పైగా పిల్లలు పాడైపోతున్నారని చెప్పారు.

శ్రీమతి రత్నమ్మగారు పై వాదనను ఖండించుచూ, నిరుద్యోగ సమస్య పెట్టుబడి దారీ విధానంవలన వచ్చినది కానీ శాస్త్రంవల్ల కాదనియు విజ్ఞానశాస్త్రం తప్పక అభ్యుదయ హేతువనియు అన్నారు. కుమారి శతకీర్తి, అనసూయ, అన్నపూర్ణ మొదలైన వారు మాట్లాడిన పిమ్మట సభ్యుల అభిప్రాయమునకు ఓటు తీసుకొనగా, ఎక్కువ మంది విజ్ఞానం (సైన్సు) అభ్యుదయానికి అంతరాయమనే ఓటు చేసారు.

పిమ్మట శ్రీమతి కృష్ణవేణమ్మగారు అన్నిటియందు మంచి, చెడ్డ రెండూ మిళితం అయి వుంటాయని, మనం చెడుగు వదలిపెట్టి మంచినే తీసుకుని, మానవ శ్రేయస్సుకే వుపయోగించాలని, చెప్పారు. పాశుపతాస్త్రం నేటి ఏటంబాంబు వంటిది. దానిని అర్జునుడు దుర్వినియోగం చేసాడా? స్వతః 'సైన్సు' అభ్యుదయానికి అంతరాయం కాదు. దానిని సంఘం యెట్లు వుపయోగిస్తుందో దానిపైనే సైన్సుయొక్క మంచి చెడ్డలు ఆధారపడివున్నాయి అన్నారు. నాటి సభ అధ్యక్షురాలికి సభ్యులకు కృతజ్ఞతా వందనలతో ముగిసినది.

★

పిల్లలను సంరక్షించండి!

(బ్రిటిష్ అంపైర్ లెప్రసీ రిలీఫ్ అసోసియేషన్ యొక్క ఆనరరీ పబ్లిసిటీ సెక్రటరీ గారైన శ్రీ టి. యస్. జగదీశన్‌గారు ప్రకటించిన కరపత్రంలోని హంశాలు)

పెద్దవారి కంటె పిన్నవాండ్రు కుష్ఠరోగానికి చప్పున గురియౌతారన్న విషయం పూర్వంనుంచీ తెలిసిందే. ఇంగ్లాండులో మతగురువుల బోధలో ఉంది—కుష్ఠరోగి, పిల్లల్ని—తన సొంత బిడ్డలైనా సరే, తాకరాదని. కాని, అంతా ఒక దశాబ్దంనుంచి, పిల్లల కుష్ఠరోగం విషయమై ప్రజలు తగినంత శ్రద్ధ తీసుకుంటూయుంటు. ఇప్పుడు నిర్ధారణ మైంది—'కుష్ఠరోగం విస్తారంగా, పిల్లల రోగము' అని; అంటే, కుష్ఠరోగం ప్రబలంగానున్న దక్షిణ ఇండియా వంటి ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన రోగులకిది చిన్న తనంలోనే అంటుకున్నదని. పెద్దవారికి రోగం రాదనిగాదు, కాని, వారు రోగులతో బాగా కలిసి తిరిగినా, వారికి రోగం అట్టే అంటుకోదు. దీనివల్ల తేలేది యేమిటంటే, కుష్ఠరోగం వ్యాపించకుండా ఉండాలంటే, ముఖ్యంగా పిల్లలు, రోగుల్ని అంటుకోకుండా చేయడానికి శ్రద్ధ వహించడం. ఇలాగ పిల్లల కుష్ఠరోగం విషయంలో 'రోగం రాకుండా ఆపడానికి తీసుకోవలసిన జాగ్రత్త'లకు ఎక్కువ ప్రాధాన్యత వచ్చింది.

మద్రాసు రాష్ట్రంలో 1932వ సం॥లో పిల్లల కుష్ఠ రోగం విషయమై మొదటి ప్రయత్నాల యొక్క ఫలితంగా చెంగల్పట్టులో లేడీ విల్లింగ్డన్ లెప్రసీ సేనిటోరియంలో కుష్ఠ రోగమున్న పిల్లలకి యెక్కువగా ఆశ్రయ మివ్వడానికి యేర్పాట్లు జరిగేయి. తర్వాత మెట్టు, 1937లో పిల్లల కుష్ఠ రోగాన్ని గురించి పరీక్ష చేయడానికి సైదాపేటలో సిల్వర్ జూబిలీ క్లినిక్ పెట్టడం. ఆపైమెట్టు 1941వ సం॥లో సేలంలో పిల్లల లెప్రసీ సేనిటోరియం కట్టడం.

సైదాపేట క్లినిక్ యొక్క పరిశోధనల ఫలితంగా—కుష్ఠరోగం రావడంలో మూడు ప్రాముఖ్య విషయాలున్నాయన్న సంగతి తేలింది. (1) ఏ రకపు కుష్ఠరోగమున్న రోగితో అంటుకు తిరిగితే రోగం వ్యాపిస్తుంది అన్న విషయం. (2) ఇలా అంటుకు తిరిగే వాని యొక్క వయస్సు. (3) ఈ అంటుకోవడం, ముట్టుకోవడం ఏ విధంగా జరుగుతున్నది అన్న విషయం. అంటు రోగమున్న కుష్ఠరోగితో అంటుకు తిరిగితే తప్ప, కుష్ఠరోగం రాదు. క్రిక్కిరిసి యున్న యింట్లో, అంటురోగమున్న కుష్ఠరోగితో చాలకాలం అంటుకు తిరిగిన కేసుల్లో, ఈ రోగం, పిల్లన్ని చాలదారుణంగా పట్టుకున్నట్లు తేలింది. కుటుంబంలో ఇలా అంటుకు తిరగడాలవల్ల ముఖ్యంగా ఒకే గదిలో ఒళ్లు రాసుకుంటూ జీవించడంవల్ల, కుష్ఠరోగం ఎక్కువగా వ్యాపించింది. కుటుంబానికి చెందని రోగుల్ని, పిల్లలు, బయట ముట్టుకు తిరగడంవల్ల ఈ రోగం చాల తక్కువగా వ్యాపించింది. అప్పుడప్పుడు రోగిని తాకడం అట్టే అంత ప్రమాదం కాదు. కుష్ఠరోగం పిల్లలకు రావడం, వచ్చినట్లు చిహ్నాలు కన్పించడం, 15 సం॥ వయస్సులోపున ఎక్కువ కేసులున్నాయి. ముఖ్యంగా 6-13 సంవత్సరాల వయస్సు మధ్య యీ రోగం కనిపిస్తుంది. కాని, సాధారణంగా 2-5 సంవత్సరాలు కొంచం అణిగియుండి అప్పటకు ప్రత్యక్ష మౌతుంది. అర్ధ సంవత్సరం మొదలు 40 సంవత్సరాలు యీ రోగం దాగియుండడంకూడా కలదు గాని యిలాంటి కేసులు అరుదు. అంటురకపు కుష్ఠరోగంయున్న రోగిని ముట్టుకు తిరిగిన పిల్లలందరికీ యీ రోగం రాకపోవడం, వచ్చినా అంత తీక్షణంగా కనిపించక పోవడం గమనించదగ్గ విషయం. ఇలా రోగం అంటుకున్న పిల్లలు పెద్దవారయ్యే లోపునే నూటికి 40 కేసుల్లో, ఈ రోగచిహ్నాలు పూర్తిగా పోవడంకూడా వింత విషయమే. దీనివల్ల తేలేదేమిటంటే- పెద్దలకంటె పిన్నలకు యీ రోగం చప్పున అంటుకున్నా, ఇది మళ్లీ వారినుంచి ఇతరులకు పాకడం చాల తక్కువ. కుష్ఠరోగ సూక్ష్మక్రిమి తమ శరీరంలో ప్రవేశిస్తే పిన్నల కంటె పెద్దలు ఎక్కువగా దీనికి తట్టుకోగలుగుతారు, పిల్లలు కొంచం త్వరగా లొంగిపోతారు.

పిల్లలను సంరక్షించండి !


పిల్లల కుష్ఠురోగాల్ని పరీక్షించడంవల్ల, యీ రోగం రాకుండా, ఆపడానికి అమూల్యమైన భోగట్టాలు లభించేయి. కుష్ఠురోగులనుంచి వేరుపరచి ఆరోగ్యంగామున్న, వారి బిడ్డల్ని, పోషించడానికి ప్రత్యేక వసతి గృహాలు ఇండియాలో అక్కడక్కడ ఉన్నాయి. ఈ సంస్థలన్నిట్లోను తేలిందేమిటంటే—తల్లిదండ్రులు కుష్ఠురోగులైనా సరే, పిల్లల్ని చిన్న వయస్సులోనే రోగులనుంచి వేరుపరచి, వారిని తాకకుండా ఉంచ గలిగినట్లయితే పిల్లలకి రోగం రాదన్న విషయం. అంచేత పిల్లలకు కుష్ఠురోగం రాడానికి ముఖ్య కారణం రోగిని అంటుకు తిరగడమేననీ పెద్ద వారికి రోగం ఇందువల్ల అట్టే రాదనీ తేలింది. అంచేత అంటురకం కుష్ఠురోగమున్న రోగిని అంటుకుని ముట్టుకుని తిరగకుండా ఆప గలిగేమంటే పిల్లలకు కుష్ఠురోగం రాకుండా ఆపగలమన్నమాట. కుష్ఠురోగ నివారణ నిర్మూలనలకున్న అన్ని పద్ధతుల కంటె ఈ పద్ధతివల్ల కుష్ఠురోగం వ్యాపించకుండా చేయడానికి చాల హెచ్చుగా వీలున్నదని ఒక ప్రముఖ వైద్యులన్నారు.* అసలు, ఈ రోగం సంఘంలో వ్యాపించకుండా చేయడానికి మనం చేయగలిగినదికూడా యిదేను—ఏమిటంటే అంటురకపు కుష్ఠురోగమున్న రోగుల్ని పిల్లలు అంటుకు తిరక్కుండా ఆపడం. ఇలా పిల్లల్ని ఆపగలిగేమంటే సంఘంలో క్రమంగా ఈ రోగం తగ్గిపోతుంది. పిల్లల ద్వారా వ్యాపించకుండా యీ రోగం ఏ జాతిలోనూ వ్యాపించలేదు. నార్వే దేశంలో అంటురకపు కుష్ఠురోగమున్న రోగిని పిల్లలు అంటుకోకుండా ఆపడం మూలంగా—ఈ రోగవ్యాప్తిని ఎక్కువగా అరికట్ట గలిగేరు.

పిల్లలకు కుష్ఠురోగం రాకుండా ఆపడానికీ, వచ్చిన వారికి వైద్య చికిత్స అందించడానికీ కృషి జరగాలి. ఈ క్రింది పద్ధతుల్లో పని జరగాలి. (1) కుష్ఠురోగమున్న తల్లిదండ్రుల నుంచి, పిల్లల్ని, పుట్టగానే వేరుపరచడానికి (2) కుష్ఠురోగ చికిత్సాలయాలు స్థాపించడం. వీటికి స్కూళ్లుకూడా చేరి ఉండాలి. (3) అంటు రోగినుంచి పూర్తిగా పిల్లల్ని వేరు చేయడానికి వీలైనపట్ల, అలాంటి పిల్లల్ని బంధువుల యింటికో, అనాథ శరణాలయాలకో, ప్రత్యేక చిల్డ్రెన్స్ హోమ్సుకో పంపించాలి. (4) కుష్ఠురోగమున్న పిల్లల్ని కని పెట్టడానికి ఇళ్లల్లోను, స్కూళ్లలోను ప్రత్యేక వైద్య పరీక్షకు లేర్పాట్లు జరగాలి. ఇందుకు ప్రజలు కృషి చేయాలి, ప్రభుత్వం సహాయం చేయాలి. ఐతే, పిల్లల కుష్ఠురోగ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోండన్న సందేశం ప్రతి యింటికీ అందాలి. కుష్ఠురోగిని లెప్రసీ ఆస్పత్రులకు పంపించక పోతే ఇంట్లోనైనా వీరిని వేరుగా ఉంచడానికి యేర్పాట్లు జరగాలి. సాగినట్లయితే, రోగి ప్రత్యేక యింట్లో నివసించడం మంచిది. ఇది సాగకపోతే, రోగి ఒక ప్రత్యేక గదిలోనైనా ఉండాలి. ఇది యితర గదులతో అంత సంబంధంలేనిదిగా ఉండడమూ, రోగి వాడే పడక, దుస్తులు, సామగ్రి, ఇతరుల వాటితో కలియకుండా ఉండడమూ మంచిది. రోగి వేరుగానే శయనించాలి. అంటురకపు రోగమున్న రోగి దగ్గరకు పెద్దవారు మాత్రమే వెళుతుండాలి. రోగి—పిల్లల్ని తాకడంగాని, ముద్దులాడ్డంగాని, మరే విధంగాను పిల్లల్ని ముట్టుకోవడంగాని చేయకూడదు. తల్లి, తన బిడ్డను, రోగితో ప్రమేయం లేకుండా ఉంచగలిగడం నేర్చుకుందంటే—మనం కుష్ఠురోగ నిర్మూలనానికి గొప్ప ముందడుగు వేయగలిగే మన్న మాటే. తల్లి గాని, ఆమె భర్తగాని దగ్గర బంధువుగాని అంటురోగిగాయుండి, ఇంట్లోనే ఉంటున్నట్లయితే, ఆరోగ్యవంతులైన బంధువుల యింటికి గాని, చిల్డ్రెన్ హోముకుగాని పిల్లల్ని పంపేయడం ఉత్తమం.

కుష్ఠురోగి విషయంలో—పిల్లల్ని సంరక్షించే మంటే సంఘాన్ని రక్షించినట్లే.

* డా॥ ఆర్. జి. కొక్రేన్ గారు పిల్లల కుష్ఠురోగాన్ని గురించి యిచ్చిన ఉపన్యాసాల్లో తేల్చిన విషయ మిది.

తెలుగు పూలు



బెజవాడ, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘంవారు చిన్న పిల్లలకోసం ప్రచురించిన 16 పేజీల పుస్తకం. రచయిత, వార్ల చిరంజీవి; 79 చిన్న పద్యాల్లో పిల్లలకు చక్కటి సూత్రాలు సులభశైలిలో నున్నాయి. చదువు, ఆరోగ్యం, ప్రవర్తనవగైరా అనేక విషయాల్ని గురించేగాక, నీతి, దానితోబాటు జాతీయ భావాలు జతపరిచేరు. ఇలాంటి పద్యాలు పిల్లలచే చదివించి, చదివినవి ఆచరించేటట్లు చేయిస్తే భావి పౌరులు కాబోయే పిల్లలకూ దేశానికీగూడ మంచిది. పుస్తకం వెల 3 అణాలు. పైసంఘంవారికిగాని, ప్రజాశక్తి ప్రచురణాలయం వారికిగాని వ్రాసి తెప్పించుకోవచ్చు.— క. సు.

జేబురుమాలు

ఇతర కథలు

'చిన్న కథ' వాఙ్మయంలో అత్యున్నతమైన స్థానం సంపాదించింది. నవలలు, నాటకాలు హృదయాన్ని ఆకర్షిస్తాయి; ప్రబోధిస్తాయి. కాని వాటిలో ఒక విధమైన అస్వాభావిక వాతావరణం కన్పిస్తోనేవుంటుంది. నాటకాని కుండవలసిన 'నాటకం', నవల కుండవలసిన 'నావెల్టి' లేకపోతే అవి రక్తి కట్టవు. వీటిని రచయిత సృష్టిస్తాడు జీవితంలో సాధారణంగా సంభవించని కొన్ని సన్నివేశాలను కల్పించి. రచయితకు ఆప్రజ్ఞ లేకపోతే తన అభిప్రాయాలను, ఆదర్శాలను విస్పష్టంగా చెప్పకోడానికి వీలుంటుంది నవలలోను, నాటకంలోను. 'చిన్నకథ' జీవితంలోని ఒక చిన్న ఘట్టాన్ని వున్నదున్నట్లుగా 'రికార్డు' చేస్తుంది. అందులోనే వుంది కథకుని ప్రజ్ఞ. కథలు వ్రాసే మనవాళ్లందరిలోనూ బుర్రా వెంకటసుబ్రహ్మణ్యంగారు గట్టివాడు. ఆయన వ్రాసిన నాలుగు కథలను సంపాదించి నవరచనావళి తొలిపువ్వంగా ఆంధ్రులకు అందచేసింది. ఈ కథలలో వచ్చే ఏ వ్యక్తీ సుగుణఖనీగాదు, పరమదుర్మార్గుడూ కాదు. ఇల్లాంటివాళ్లను సాధారణంగా చూస్తూనేవుంటాము, మరో లోకంలో వాళ్లు కారు. ప్రతీ కథలోనూ మానసిక ప్రవృత్తులు చక్కగా చిత్రింపబడ్డాయి. సంఘంలోని లోటుపాట్లను సూక్ష్మంగా చూపెట్టాడు కథకుడు. అయినా కథకుడు తన నోటిమాటగా ఒక్కటీ చెప్పలేదు. రచయిత యొక్క అభిప్రాయంకూడా యేమిటో మనకి తెలియదు. 'జేబురుమాలు'లో ఒక మోడరన్ జూలియెట్‌కు నలుగురు రోమియోలు తటస్థిస్తారు ఒకరి తరువాత ఒకరు. ఈ పరిస్థితికి ఆమె చాపల్యమో లేక వారి దుర్బలత్వమో కారణం మనం వూహించుకోవాలి. మొదటి మాటు చదివితే 'స్వేచ్ఛ'లో భర్త దద్దమ్మలాగా, భార్య పిశాచిలాగా అనుకుంటాం. కాని శ్రీనివాసరావు విల్లూ, రమణయ్య దారిద్ర్యం, డబ్బంటే కామేశ్వరి నిర్లక్ష్యం గురించి కథ ఆఖరి భాగంలో చదువుతోంటే భర్త దద్దమ్మ కాడేమో, ఆదర్శంకోసం ఏడ్చే అలవాటున్న వాడేమోననీ, భార్య యేమో, యేమోననీ అనిపిస్తుంది. కథకుడు మటుకు యేమీ అనడు. ఇలాగే వంశ వృక్షం, పరామర్శకూడా చక్కటి కథలు, బుర్రకి పని చేస్పే కథలు కాబట్టి మరపుకురావు. నవరచనావళి సంపాదకులు మల్లవరపు విశ్వేశ్వరరావుగారు యీ సంపుటిని ప్రచురించి వందులకు అభినందనీయులు. పుస్తకం వెల రూపాయిన్నర. నవరచనావళి, 48 దేశిగార్ స్వామి వీధి, మైలాపూరుకు వ్రాయండి. —బినా

నిర్మాణ కార్యక్రమము

60 పేజీల్లో, చేతితో చేసిన కాగితంమీద, చక్కటి అచ్చుతో, చదివినంతనే చక్కగా అర్థమయ్యే తెలుగు శైలిలో అన్నివిధాలా ముద్దొస్తున్న పుస్తకం. ప్రతీ ప్రజాసేవకుడు, ప్రతీ విద్యార్థీ చదవవలసిన గ్రంథం. గాంధీజీ వ్రాతలకు శ్రీ మోటూరి సత్యనారాయణగారి ఆంధ్రానువాదం 24 పేజీలు, శ్రీ రాజేంద్రబాబుగారి వ్యాఖ్యకు శ్రీ పూటుకూరి నరసింహారావుగారి అనువాదం మరో 36 పేజీలు., మొదట్లో శ్రీ సరోజనీదేవిగారి సందేశం, శ్రీ పట్టాభిగారి పీఠికలతో అలరారే గ్రంథం. ప్రధాన సంపాద

కుల శ్రీ మాగంటి బాపినీడుగారి తొలిపలుకులే చక్కటి విమర్శ :—"నిర్మాణ కార్యక్రమం అంటే సమస్త భారత జాతిని మానసికంగానూ, ఆర్థికంగానూ స్వరాజ్య ప్రాప్తి కోసం తయారుచేయడం అన్న మాట. అందువల్లనే గాంధీ మహాత్ములు దక్షిణ ఆఫ్రికానుంచి వచ్చినదాది నేటివరకు సమస్త శక్తుల్నీ నిర్మాణ కార్యక్రమ సిద్ధికోసం వినియోగిస్తున్నారు. ఇందుకై 15 అంశాల కార్యక్రమాన్ని తయారు చేశారు. దీనికి మరి మూడు అంశాలనుచేర్చి కాంగ్రెస్ ఆమోదించి అమలులోనికి తేవటానికి ప్రయత్నం చేస్తున్నది.

"ఈ అంశాలన్నీ విపులంగానూ, విరివిగానూ ప్రజలకు అందుబాటులో వుండేటట్లు, అర్థం అయేటట్లు చేయటానికి స్వయంగా ఆయన ఒక పుస్తకం వ్రాశారు. ఈ పుస్తకానికి విపులమైన వ్యాఖ్య శ్రీ రాజేంద్రబాబు వ్రాశారు. ఆంధ్ర దేశంలో నిర్మాణ కార్యక్రమమునకు ఏకైక నాయకుడు డా. పట్టాభిగారు.

గాంధీ మహాత్ముని సూత్రాలు, రాజేంద్రబాబు వ్యాఖ్యా, డా. పట్టాభిగారి పీఠిక ఈ మూడు చేరిస్తే నిర్మాణ కార్యక్రమంయొక్క సంపూర్ణ చిత్రం ప్రజలకు విపులంగా బోధపడక తప్పదు. అందువల్లనే ఈ నాయకత్రయం యొక్క అభిప్రాయాల్ని చేర్చి జాతీయ విజ్ఞానమందిరం తరఫున ప్రచురిస్తున్నాము. ఇది మా రెండవ పుస్తకం. ఆంధ్ర మహాజనులకిది ఎంతో ప్రయోజనకారి కాగలదని ఆశిస్తున్నాము."

పుస్తకం వెల 12 అణాలు

ప్రాప్తిస్థానం : జాతీయ జ్ఞానమందిరం,
త్యాగరాయనగరం, మద్రాసు.

అపనింద

"అపనింద" నాటకం వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణగారి రచన. 90 పేజీలలో చక్కటి కాగితము మీద ముద్రించబడింది.

ఇందలి శైలి మృదుమధురము. వాక్యములు సరళములు. దీనియందు సంఘమందలి దురాచారములను, మరియు మామూలు కుటుంబములయందలి కలహములు మొదలైనవి బాగా వర్ణింపబడియున్నవి.

పార్వతి పాత్రచే ప్రస్తుతకాలపు బాల వితంతువుల దుస్థితి, వారు అవిద్యావతులగుటచే ఎంత సులభముగా, అమాయకముగా, స్వార్థపరులైన కొందరిమాటలను నమ్మి నాశనము పొందుచున్నారో బాగా వర్ణించబడినది.

డా. భుజంగరావు నడవడికచూచిన, నేటి విద్యావంతులు, నాగరికులమని విఱ్ఱవీగు యువకుల స్వార్థములు, అన్యాయములు తెలియనగును. వైద్యుడుగా పార్వతికి చికిత్సచేయుటకు వెళ్లి, కల్లబొల్లి మాటలచే ఆమెను నమ్మించి, ఆమెకద్ద సాధ్యమైనంత ధనమును, సౌఖ్యమును అనుభవించునది చాలక ఆమె పిత్రార్జితమునంతయు అపహరింపవలెనన్న దురాశచే, ఆమె ఏకైక భ్రాత, గుణశీలుడునైన ప్రసాదును బహిష్కృతునిగా నొనర్చుటకు చేసిన కుట్రలు, (అక్షరాల నూటికి 75 గురిలో వున్నవి) చాలా సహజముగా వ్రాయబడియున్నవి. ఇదిగాక సాధారణముగా యువకులు ఊసరవల్లులవలె దినమునకొక పార్టీని మార్చుటను, ఓట్లకొరకు పడు తాపత్రయములను, వ్యంగముగాను విశదీకరించబడినది.

సుశీల, మాలతి పాత్రలచే విద్యావతుల వివేకమును సాధ్వీత్వమును, ఆదర్శమైన నడవడికను, చూపెట్టుచు వారికి స్వార్థపూర్వమైన, కుటుంబ సంఘములందు అనవసరమైన నిందలు ఎట్లు వచ్చుచున్నవో ఎత్తి చూపబడినది. ఇటువంటి నింద సత్శీలులైన సుశీల, ప్రసాదులకు కలిగినందుచేతనే ఈ పుస్తకమునకు 'అపనింద' యను నామకరణము చేయబడినది.

స్వామిభక్తి, నిస్వార్థ సేవాపరాయణత, వృద్ధ పరిచారకుడైన రామన్న పాత్రయందు పోషింపబడియున్నవి.

దేశ, కాలానుగుణముగా నడువనేరని వృద్ధులు, ప్లీడరు రంగయ్యమూర్తిగారు మొండి పట్టుదలచే ప్రవర్తించుట వలన, ప్రమాదములను ఎట్లు ఎదుర్కొనవలసి వచ్చెనో వర్ణించుచు, ఇకనిమీదనైనను వర్తమానకాలపు సనాతనులు తెలివిగా ప్రవర్తించుటకు సూచనలివ్వబడినవి.

ఆఖరులో ధర్మమునకు పూర్ణవిజయము, అధర్మమునకు పూర్ణ పరాజయమును స్థాపించి యుండుటచే నైతికబలము సహిత మీ పొత్తమున పూర్ణత గాంచినది.

దీనియందు అనేకవిధములైన సాంఘిక దురాచారములు, వాటి విధ్వంసక సూచనలుకూడా తెలుపబడియుండుటచే చదువరుల మనోపరివర్తనమున కీ నాటకము నిస్సందేహముగా ఉపయోగపడగలదు. —ఆర్. రమాబాయి

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.